thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

క్రికెట్ పిచ్ పై భారత్-జపాన్ దోస్తానా



11

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 153 | జగిత్యాల ఆదివారం 06 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహమ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## పోలీసులకే సవాల్..

- సీజేపీ నిరసనల ఘటనలో ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్
- దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు
- బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య
- ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్
- కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ



.. వివరాలు 4లో

## బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన




4

## లష్కర్ కమాండర్ హతం

- భద్రతా దళాల మెరుపు దాడి
- బద్గాంలో సంయుక్త ఆపరేషన్


4

జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్ పర్వత ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా దళాలు జరిపిన మెరుపు ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన కీలక పాకిస్థానీ కమాండర్ 'యాసిర్' హతమయ్యాడు.



# రెండేళ్లలో టీచర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తా

### విద్యారంగ రూపురేఖలు మార్చేస్తా

- ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- అనేక సంస్కరణలు, మార్పులు తెస్తున్నాం
- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ
- కొడంగల్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2

## 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్

- దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్
- హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి
- గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం
- దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సీఎం రేవంత్


2




# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

- వెయ్యి రోజుల మోసానికి రేవంతే తప్పుకోవాలి: కేటీఆర్
- 420 హామీలకు 420 సార్లు రాజీనామా చేయాలని ఎద్దేవా
- నిరుద్యోగులను నిండా ముంచారని కాంగ్రెస్‌పై ధ్వజం
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక
- కరీంనగర్ యువ సమరభేరిలో తీవ్ర విమర్శలు

**కరీంనగర్, సెప్టెంబర్ 5 (చురకలు):** "తెలంగాణ సాధించిన కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి? వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే రాజీనామా చేయాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలకు ఆ పార్టీ నాయకులు 420 సార్లు రాజీనామా చేయాలని ఎద్దేవా చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన

మిగతా 3 లో

# సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు.

- ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం
- కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?
- సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా
- సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు
- వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు
- ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు
- ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?
- ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- కిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

2

## భారీగా పెరగనున్న ఆటో చార్జీలు!



- బేసిక్ చార్జీగా రూ.30 నిర్ణయం
- ప్రభుత్వం ఆమోదమే తరువాయి..

2

తెలంగాణలో ఆటో చార్జీల పెంపునకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి నేతృత్వంలోని అధికారుల కమిటీ తయారుచేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు చేరాయి. ప్రభుత్వం ఈ సిఫార్సులకు లాంఛనంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త చార్జీల అమలుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.



## దొరకని ఆయుధాలు.. దొంగల జాడేదీ?

- నాలుగు రోజులైనా చిక్కని కీలక ఆధారాలు
- రంగంలోకి దిగిన జాతీయ దర్యాప్తు సంస్థ
- జవాన్లు, మాజీ సిబ్బందిపై విస్తృత విచారణ
- రాత్రి పనిచేయనిసీసీకెమెరాలపై అనుమానాలు
- ఆయుధాల లెక్కల్లో వ్యత్యాసాలపైనా ఆరా

2

## '22ఏ' పేరుతో భూదందా!

- ప్రజల భూములు లాక్కునే కుట్ర: రాంచందర్‌రావు
- కేసీఆర్ బాటలోనే రేవంత్ సర్కార్
- బాధిత భూములపై వెంటనే సమీక్షకు డిమాండ్
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం

3



# రేపటి నుంచి అసెంబ్లీ

- ఉభయ సభల సమావేశాలకు సర్వం సిద్ధం
- ప్రశాంత వాతావరణం ఉండేలా పటిష్ఠ చర్యలు
- సభ్యుల ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు
- మూడు భాషల్లో సభ సమాచారానికి ఆదేశం
- కీలక బిల్లులు.. ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 6 (చురకలు):** అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా

మిగతా 3 లో



## శతాబ్దం దాటినా.. విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖీ
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ

4




# భారీగా పెరగనున్న ఆటో చార్జీలు

**బేసిక్ చార్జీ రూ. 30కి పెంపునకు సిఫార్సు**

**ప్రభుత్వ ఆమోదమే తరువాయి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** తెలంగాణలో ఆటో చార్జీల పెంపునకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి నేతృత్వంలోని అధికారుల కమిటీ తయారుచేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనకు చేరాయి. ప్రభుత్వం ఈ సిఫార్సులకు లాంఛనంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త చార్జీల అమలుపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం, ఆటోలకు కనీస చార్జీగా తొలి 1.6 కిలోమీటర్ల దూరానికి రూ.30, ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయాలని ప్రతిపాదించారు. అలాగే, ట్రాఫిక్ లేదా ప్రయాణికుల కోసం వెయిటింగ్ సమయానికి నిమిషానికి 75 పైసలు, రాత్రి వేళల్లో (నైట్ చార్జీలు) సాధారణ చార్జీ కంటే 50 శాతం అదనంగా అమలు చేయాలని సిఫార్సు చేశారు. తెలంగాణ ఆటో, క్యాబ్ జేఏసీ యూనియన్లు తమ 14 ప్రధాన డిమాండ్లపై నిర్వహించిన నిరసనల అనంతరం, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకే ఈ అధ్యయనం చేపట్టారు. డీటీసీ సురేశ్ రెడ్డి, ఎంవీఐ శ్రీనివాస్ బృందం ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, కేరళలోని చార్జీలను పరిశీలించి ఈ నివేదిక ఇచ్చింది. రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా ఆటో చార్జీలను సవరించలేదని, ఈ కాలంలో ఇంధన ధరలతో పాటు ఇన్సూరెన్స్, విడిభాగాలు, నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయని తెలిపింది. ఆటో కొనుగోలు వ్యయం, రుణాలు, డ్రైవర్ల జీతాలు, ప్రతి కిలోమీటరుకు రూ. 13.53 అయ్యే నిర్వహణ వ్యయాన్ని ప్రామాణికంగా తీసుకుని ప్రతి కిలోమీటరుకు రూ. 14గా నిర్ణయించాలని సూచించింది. మంత్రివర్గ ఆమోదం ముద్ర పడగానే రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా కొత్త మీటర్ చార్జీలు అమల్లోకి రానున్నాయి.

# దొరకని ఆయుధాలు.. దొంగల జాడేదీ?

**నాలుగు రోజులైనా చిక్కని కీలక ఆధారాలు**

**రాత్రివేళ పనిచేయని సీసీ కెమెరాలపై అనుమానాలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆర్మీ రెజిమెంట్ ఆయుధాగారం నుంచి అధునాతన ఆయుధాలు మాయమైన ఘటనలో నాలుగు రోజులు గడిచినా మిస్టరీ వీడటం లేదు. ఆయుధాలను ఎవరు అపహరించారు? ఎక్కడికి తరలించారు? అన్న కీలక ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు. జాతీయ భద్రతతో ముడిపడిన వ్యవహారం కావడంతో కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించినట్లు సమాచారం. దీంతో ఎన్ఐఏ అధికారులు రంగంలోకి దిగి దర్యాప్తును ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులతో పాటు మిలిటరీ ఇంటెలిజెన్స్, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులు ఇప్పటికే విస్తృతంగా విచారణ చేపట్టారు. రెజిమెంట్‌లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న జవాన్లతో పాటు గతంలో అక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన సిబ్బందినీ ప్రత్యేక బృందాలు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అనుమానితుల ఫోన్ కాల్ సమాచారం, కదలికలను విశ్లేషించినప్పటికీ నిందితులను గుర్తించే కీలక ఆధారాలు ఇప్పటివరకు లభించలేదని సమాచారం. దర్యాప్తులో వెలుగుచూస్తున్న భద్రతా లోపాలు అధికారులను కలవరపెడుతున్నాయి. ఆయుధాలు నిల్వ చేసే అత్యంత కీలకమైన 'కోట' ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంతకాలంగా ప్రతిరోజూ రాత్రి 10.30 గంటల తర్వాత పనిచేయడం లేదని విచారణలో గుర్తించినట్లు సమాచారం. తిరిగి ఉదయం 7 గంటల సమయంలోనే అవి పనిచేస్తున్నట్లు తేలిందని తెలుస్తోంది. సీసీ కెమెరాల నిలిపివేతకు సంబంధించి ఎలాంటి రాతపూర్వక ఆదేశాలు లేవన్న అంశంపైనా అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. రాత్రివేళల్లోనే భద్రతా నిఘా అత్యంత కీలకంగా ఉండగా.. అదే సమయంలో కెమెరాలు పనిచేయకపోవడం వెనుక సాంకేతిక సమస్య ఉందా? ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారా? లోపలి వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. ఆయుధాగారం నిర్వహణకు సంబంధించిన రికార్డులపైనా దర్యాప్తు బృందాలు దృష్టి పెట్టాయి. ఘటనకు సుమారు 15 రోజుల ముందు నుంచే ఆయుధాలు, మందుగుండు సామగ్రికి సంబంధించిన రిజిస్టర్లలో లెక్కల వ్యత్యాసాలు ఉన్నట్లు అంతర్గత పరిశీలనలో గుర్తించినట్లు సమాచారం. రోజువారీ లెక్కల నమోదులో తేడాలు, సీసీ కెమెరాల పనితీరు మధ్య ఏదైనా సంబంధం ఉందా అన్న కోణంలోనూ సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భద్రతా వర్గాలను కలవరపెడుతున్న ప్రధాన అంశం చోరీకి గురైన ఆయుధాల ఆచూకీ. అవి ఎక్కడికి చేరాయి? ఎవరి చేతుల్లో ఉన్నాయి? చోరీ వెనుక ఉద్దేశం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడమే దర్యాప్తులో కీలకంగా మారింది. అధునాతన ఆయుధాలు నేరగాళ్ల లేదా ఉగ్రవాదుల చేతుల్లోకి చేరితే తీవ్ర భద్రతా ముప్పు ఏర్పడే అవకాశం ఉండటంతో వీలైనంత త్వరగా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఆయుధాలు చోరీ వెనుక బయటి వ్యక్తుల హస్తం ఉందా.. లేక 'ఇంటి దొంగల' పాత్ర ఉందా అన్నదే ఇప్పుడు దర్యాప్తులో కీలకంగా మారింది.



# రెండేళ్లలో టీచర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తా

- విద్యారంగ రూపురేఖలను మార్చేస్తా
- ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- అనేక సంస్కరణలు, మార్పులు తేస్తున్నాం
- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశాం
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేదు
- కొడంగల్ పర్యటనలో రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** రాష్ట్రంలో విద్యారంగ రూపురేఖలను మార్చేందుకు ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, విద్యాశాఖలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని, తనకు రెండేళ్ల సమయం ఇస్తే అన్ని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులతో సమానంగా సమాజంలో పిల్లల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. గత పాలకుల హయాంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో పడివున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిత్తశుద్ధితో పూర్తి చేసిందని గుర్తుచేశారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ఎక్కడా ఎలాంటి పొరపాటు, అభ్యంతరాలకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. "రాష్ట్రంలో కొత్తగా 88 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. అందుకే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నా బాధ్యత. సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తుంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యాశాఖ కమిషన్ ద్వారా దశాబ్దాలుగా పేరుకుపోయిన ఎన్నో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఆర్సీ సమస్యను కూడా పరిష్కరించాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వానికి ఎంతో గౌరవం ఉందని చెబుతూ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇటీవల హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించడం నన్ను ఎంతో బాధించింది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పుడు రోడ్డెక్కడం తగదు. చర్చల ద్వారానే పరిష్కారం దొరుకుతుంది" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. గత జ్ఞాపకాలు, విద్యా ప్రగతిని ప్రతిబింబించే చిత్రాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ బోధనారంగంలో మరింత అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. పాలిటెక్నిక్ విద్యా విధానంలో ఎలాంటి మార్పులు చేయట్లేదని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విషయంలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. ఉపాధ్యాయులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేయాలని చూస్తున్నారన్న రేవంత్? రెడ్డి, అలాంటి వారి ట్రాప్?లో పడొద్దని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు మనమంతా పునరంకితమవుదామని పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి, ఉపాధ్యాయుల బాధ్యత తాను చూసుకుంటానని, విద్యార్థుల బాధ్యత టీచర్లు చూసుకోవాలని సూచించారు. అంతకుముందు కొడంగల్ నివాసంలో కార్యకర్తలు, స్థానిక నాయకులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. తెలంగాణలో ఓట్లను తొలగించి దొంగ దెబ్బ తీయాలనుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించాలని చూస్తున్నారన్న ముఖ్యమంత్రి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను బీజేపీ టార్గెట్ చేసిందన్నారు. గతంలో ఎన్నికల్లో ఓడించేందుకు ఈడీ, సీబీఐ ఉపయోగించేవారన్నారు. కాంగ్రెస్‌ను ఓడించే కుట్రకు బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతు ఇస్తోందన్న రేవంత్ రెడ్డి, అందరూ అప్రమత్తంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

**దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్**

**హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి**

**గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం**

**దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సిఎం రేవంత్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ డేటా సెంటర్ సామర్థ్యం గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది. టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

**ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం**

**కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?**

**సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా**

**సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు**

**వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు**

**ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు**

**ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా?**

**ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం**

**కిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి**

**వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్?ఎస్ అధినేత కేసీఆర్?కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

చురకలు



# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

మొదటి పేజీ తరువాయి

'యువ సమరభేరి'లో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, యూత్ కమిషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు రుణాలు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. "2006లో కూడా ఇదే కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్‌ను రాజీనామా చేయాలని సవాల్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్తే ఏం జరిగిందో గుర్తు చేసుకోవాలి. అప్పుడు కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి సమాధానం చెప్పారు" అని పేర్కొన్నారు. కేసీఆర్‌తో రాజకీయంగా తలపడితే రేవంత్‌రెడ్డికీ అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. "ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. పోరాటాలకు పురిటిగడ్డ కరీంనగర్ అని, ఇక్కడి నుంచే కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి కీలక మలుపు ఇచ్చారని గుర్తుచేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని కేటీఆర్ ఆరోపించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. యూత్ కమిషన్, ప్రైవేటు సంస్థల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు, కళాశాల విద్యార్థినులకు స్కూటీలు, యువతకు రూ.10 లక్షల రుణాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు ఎక్కడిదాకా వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. "అప్పుడు యూత్ డిక్లరేషన్ అంటూ యువతకు ఆశలు కల్పించారు. ఇప్పుడు హామీల గురించి అడిగితే ఎదురుదాడి చేస్తున్నారు" అని



విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన కేటీఆర్.. "నోటిఫికేషన్ లేదు.. లూటిఫికేషన్ మాత్రం నడుస్తోంది. జాబ్ క్యాలెండర్ లేదు.. స్కామ్ క్యాలెండర్ నడుస్తోంది" అంటూ ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలో విజన్ లేదని, విధ్వంసమే కనిపిస్తోందని విమర్శించారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల తర్వాత యువత సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై కూడా కేటీఆర్ పలు తీవ్ర ఆరోపణలు చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు అధికారం అప్పగించారని, కానీ అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. యువత పిడికిలి బిగిస్తే ఎంతటి ప్రభుత్వమైనా దిగిరావాల్సిందేనని కేటీఆర్ అన్నారు. "వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి. కేసీఆర్‌ను రాజీనామా చేయమనడం కాదు.. ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు లెక్క చెప్పాలి" అని డిమాండ్ చేశారు.

# రేపటి నుంచి అసెంబ్లీ సమరం

మొదటి పేజీ తరువాయి

అందించడంతో పాటు సమావేశాల సమయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. సమావేశాల నిర్వహణ, సభ్యులకు వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గత సమావేశాల కంటే మరింత వేగంగా, సమన్వయంతో అధికారులు పనిచేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ఈసారి సమావేశాలు వాడీవేడిగా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాలు జరిగే సమయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సభ్యులకు అవసరమైన సమాచారాన్ని తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల,



బయట ప్రశాంత వాతావరణం ఉండేలా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని స్పీకర్, ఛైర్మన్ ఆదేశించారు. ధర్నాలు, రాస్తారోకోలు తదితర ఆందోళనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నిఘా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అసెంబ్లీ అధికారులకు చేరవేసేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలని పేర్కొన్నారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందుగానే అందించాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉభయ సభల సమావేశాల నిర్వహణ ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనంగా నిలవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాల నిర్వహణకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ప్రజా సమస్యలు, ప్రభుత్వ హామీలు, పాలనాపరమైన అంశాలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు విపక్షాలు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నాయి. దీంతో ఈసారి ఉభయ సభల్లో అధికార, విపక్షాల మధ్య వాడీవేడి చర్చలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ఎన్ని రోజులపాటు కొనసాగాలన్నది బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఖరారు కానుంది.

# '22ఏ' పేరుతో భూదందా!

**ప్రజల భూములు లాక్కునే కుట్ర: రాంచందర్‌రావు**

**కేసీఆర్ బాటలోనే రేవంత్ సర్కార్**

**హైడ్రా, క్యూర్‌తో ప్రజల్లో భయాందోళనలు**

**బాధిత భూములపై వెంటనే సమీక్షకు డిమాండ్**

**న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రంగా ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రజల భూముల జోలికి వెళ్లిన ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని హెచ్చరించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన మహాధర్నాలో రాంచందర్‌రావు పాల్గొని మాట్లాడారు. 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల భూములపై ప్రభుత్వం వెంటనే సమీక్ష చేపట్టి, అర్హమైన వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా రాంచందర్‌రావు విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి' పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసి చివరకు అధికారాన్ని కోల్పోయిందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తన గోతిని తానే తవ్వుకుంటోందని వ్యాఖ్యానించారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో 30 శాతం కమీషన్ల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సొంత భూములపై అనిశ్చితి సృష్టించడం సరికాదని రాంచందర్‌రావు అన్నారు. 22ఏ జాబితాలో చేరిన భూములను ప్రభుత్వం సమగ్రంగా



పరిశీలించి, అన్యాయంగా నమోదైన వాటిని వెంటనే తొలగించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బీజేపీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. "ప్రజల భూములపై కన్నేసిన పాలకులు చరిత్రలో బాగుపడలేదు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుంది" అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

# 'రైతులను మళ్లీ రోడ్డెక్కించారు!'

**కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంట్**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

**ఇప్పుడు విద్యుత్, యూరియా కోసం రైతుల పాట్లు**

**రైతుబంధులో 29 వేల కోట్లు ఎగ్గొట్టారని ఆరోపణ**

**ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్**

**దుబ్బాక, సెప్టెంబర్ 5 (చురకలు):** "మా తెలంగాణ మాకు కావాలని నాడు రోడ్లపై వంటావార్పు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో రైతులు ప్రశాంతంగా ఉన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలనలో మళ్లీ రైతులు వంటావార్పులతో రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి వచ్చింది" అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తాము కొత్తగా గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, యూరియా, ధాన్యం కొనుగోలు, సాగునీరు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు ఎనిమిది గంటలు కూడా సక్రమంగా విద్యుత్ రావడం లేదని రైతులు ఫోన్లు చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే తాము రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ చెప్పిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న సాయాన్నే పూర్తిస్థాయిలో అందించడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. మూడేళ్లలో రైతులకు రావాల్సిన రైతుబంధులో రూ.29 వేల కోట్లు ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీఏపీ ధరలను భారీగా పెంచిందని విమర్శిస్తూనే.. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ల విధానంతో రైతులకు మరిన్ని ఇబ్బందులు తెచ్చిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్లు బస్తాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. తరుగు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గతంలో చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు సహా అన్ని వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. పెన్షన్ల పెంపు, కల్యాణలక్ష్మితో




తులం బంగారం తదితర ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. "కరెంట్, రైతుబంధు, రైతుబీమా.. ఇవన్నీ మళ్లీ పక్కాగా అందాలంటే కేసీఆర్ నాయకత్వం రావాలి. కాంగ్రెస్ చేసిన మోసాలకు రైతులు, మహిళలు ఓటుతో సమాధానం చెప్పే సమయం వస్తుంది" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# సీఎంను దూషించలేదు

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై అవకాశం దొరికినప్పుడల్లా విమర్శనాస్త్రాలు సంధించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కసారిగా యు-టర్న్ తీసుకున్నారు. తాను రేవంత్ రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, కేవలం ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌తో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేసిన ఆయన, సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే తన మునుగోడు నియోజకవర్గానికి కూడా రూ. 2 వేల కోట్ల నిధులు వచ్చాయని ప్రశంసల జల్లు కురిపించారు. త్వరలో జరగబోయే సీఎం బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని చెప్పారు.

# ఎవరు పడితే వాళ్లను పార్టీలోకి చేర్చుకోబోం

**కొండా సురేఖ చేరికపై బీజేపీ నేత మురళీధర్ రావు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. ఈ ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చుతూ, పార్టీలో చేరికలపై తమకంటూ ఒక స్పష్టమైన విధానం ఉందని తెలిపారు. "ఎవరిని పడితే వారిని పార్టీలో చేర్చుకోబోం" అని ఆయన శనివారం స్పష్టం చేశారు. కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. "ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొంది. ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారు" అని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయాలపై మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మురళీధర్ రావు చేసిన ఈ వ్యాఖ్యలతో కొండా సురేఖ చేరికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడినట్లయింది.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (చురకలు):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# 11 రోజుల తర్వాత శిథిలాల కింద ఇద్దరు సజీవం..

**1,344కు పెరిగిన మృతులు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (చురకలు):** నేపాల్‌ను తీవ్రంగా కుదిపివేసిన ఆకస్మిక వరదలు, కొండచరియల విపత్తులో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రమాదం సంభవించి 11 రోజులు గడిచినా, శనివారం ఇద్దరిని సజీవంగా కాపాడటం బాధితుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. అపర్ త్రిశూలీ-1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం లోపలి నుంచి ఒక విదేశీయుడిని (చైనా పౌరుడు) రక్షించగా, నువాకోట్ జిల్లా బిదూర్‌లో భవన శిథిలాల కింద చిక్కుకున్న 64 ఏళ్ల చండికా శ్రేష్ట అనే వృద్ధురాలిని నేపాల్ సైన్యం సురక్షితంగా బయటకు తీసింది. బాధితులకు మెరుగైన వైద్యం కోసం హెలికాప్టర్ ద్వారా కాఠ్‌మాండ్ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు వరదల్లో మృతి చెందిన వారి సంఖ్య ఇప్పటివరకు 1,344కు చేరుకోగా, మరో 5 వేల మంది వరకు ఆచూకీ లభించాల్సి ఉంది. మృతదేహాలు తీవ్రంగా దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. అధికారులు డీఎన్ఏ నమూనాలు సేకరించి ఇప్పటివరకు 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేయగా, కేవలం 96 మృతదేహాలను మాత్రమే కుటుంబ సభ్యులకు అప్పగించారు. సైన్యం, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు హెలికాప్టర్లు, తాత్కాలిక వంతెనల సహాయంతో మారుమూల ప్రాంతాల్లోనూ గాలింపు, సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నాయి.



చురకలు



## సంపాదకీయం



# యుద్ధం కాదు.. దౌత్యమే మార్గం!

**ప్రతీకార దాడులతో మరింత రగులుతున్న అమెరికా-ఇరాన్ ఘర్షణ**

**చమురు రవాణా మార్గాలే లక్ష్యాలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు**

**హోర్ముజ్‌లో ఉద్రిక్తత పెరిగితే ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం**

**ఆయుధాలకు విరామమిచ్చి చర్చల బాట పట్టాల్సిన సమయం**

అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించడం.. ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన క్రూడ్ ఆయిల్ రవాణా నౌకలపై అమెరికా దాడులు చేసినట్లు వార్తలు రావడం.. పరిస్థితి ఎంత వేగంగా అదుపు తప్పుతోందో తెలియజేస్తున్నాయి. ఒకరి దాడికి మరొకరు ప్రతీకారం తీర్చుకునే ధోరణి కొనసాగితే ఇది రెండు దేశాల మధ్య ఘర్షణగానే మిగిలిపోదు. మొత్తం మధ్యప్రాచ్యాన్ని మరో యుద్ధ సుడిగుండంలోకి నెట్టే ప్రమాదముంది. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖార్గ్ ద్వీపం పరిసరాల్లోనూ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలపై పూర్తి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ.. ఇంధన ఉత్పత్తి, రవాణా వ్యవస్థలే ప్రత్యక్ష లక్ష్యాలుగా మారితే దాని ప్రభావం యుద్ధభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశాలపైనా పడుతుంది.

### హోర్ముజ్ రగిలితే.. ప్రపంచానికే సెగ

మధ్యప్రాచ్యంలో జరిగే ప్రతి సైనిక ఘర్షణను ఆ ప్రాంత సమస్యగా మాత్రమే చూడలేం. ప్రపంచ ఇంధన రవాణాలో హోర్ముజ్ జలసంధికి అత్యంత కీలక స్థానం ఉంది. అక్కడ ఉద్రిక్తతలు పెరిగినా, నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఎగిసే అవకాశం ఉంటుంది. చమురు ధర పెరిగితే దాని ప్రభావం పెట్రోలు, డీజిల్‌తో ఆగదు. రవాణా వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి ఖర్చులు అధికమవుతాయి. నిత్యావసర వస్తువుల ధరలపై ఒత్తిడి పడుతుంది. విమానయానం నుంచి పరిశ్రమల వరకు అనేక రంగాలు ప్రభావితమవుతాయి. చివరకు యుద్ధ నిర్ణయాలు తీసుకునేది పాలకులైనా.. వాటి ఆర్థిక మూల్యం చెల్లించేది మాత్రం సామాన్య ప్రజలే.

### ప్రతీకారానికి అంతమెక్కడ?

యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన పదం 'ప్రతీకారం'. ఒక దాడికి మరో దాడి.. దానికి ప్రతిగా ఇంకో దాడి.. ఇలా సాగితే ఎక్కడ ఆగాలన్నది చివరకు ఎవరి చేతుల్లోనూ ఉండదు. మొదట పరిమిత లక్ష్యాలపై ప్రారంభమైన సైనిక చర్యలు క్రమంగా కీలక మౌలిక వసతులు, ఇంధన కేంద్రాలు, నౌకాశ్రయాలు, చివరకు జనావాసాలను కూడా ప్రమాదంలోకి నెట్టవచ్చు. దేశాల భద్రతా ప్రయోజనాలను ఎవరూ తక్కువ చేయలేరు. తమ భూభాగం, ప్రజలు, సైనిక బలగాలను రక్షించుకోవడం ప్రతి దేశానికీ హక్కే. కానీ భద్రత పేరుతో అంతులేని ప్రతీకార చక్రాన్ని కొనసాగించడం సమస్యకు పరిష్కారం కాదు. అది మరింత అస్థిరతకు బాట వేస్తుంది.

### చర్చలకు తలుపులు ఇంకా మూసుకుపోలేదు

ఈ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కూడా దౌత్యానికి అవకాశం పూర్తిగా కనుమరుగైందని భావించాల్సిన అవసరం లేదు. తాత్కాలిక ఒప్పందంలోని కట్టుబాట్లను అమెరికా పాటిస్తే తాము కూడా సహకరిస్తామని ఇరాన్ నాయకత్వం చెబుతుండటం చర్చలకు ఇంకా కొంత స్థలం మిగిలి ఉందనే సంకేతంగా చూడాలి. ఇక్కడే అంతర్జాతీయ సమాజం పాత్ర కీలకం. ఐక్యరాజ్యసమితి సహా ప్రభావవంతమైన దేశాలు కేవలం 'సంయమనం పాటించండి' అనే ప్రకటనలకే పరిమితం కాకూడదు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష లేదా మధ్యవర్తిత్వ చర్చలకు వేదికను సిద్ధం చేయాలి. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన భద్రతా హామీలు, ఇంధన రవాణాకు రక్షణ, పరస్పర దాడుల నిలిపివేత వంటి అంశాలపై తక్షణ చర్చలు జరగాలి.

### గెలిచేది ఎవరు.. ఓడేది ఎవరు?

ప్రపంచం ఇప్పటికే యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు, ఇంధన ధరల ఒత్తిడితో సతమతమవుతోంది. ఈ సమయంలో మధ్యప్రాచ్యంలో మరో దీర్ఘకాలిక యుద్ధం మొదలైతే అది ఏ ఒక్క దేశానికీ మేలు చేయదు. యుద్ధరంగంలో సైనిక విజయం సాధించవచ్చు.. కానీ కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. కూలిపోయిన ఆర్థిక వ్యవస్థలను ఒక్కరోజులో నిలబెట్టలేం. ప్రజల మధ్య పెరిగిన ద్వేషాన్ని ఒక ఒప్పందంతో చెరిపేయలేం. అందుకే అమెరికా, ఇరాన్ రెండూ సంయమనం పాటించాల్సిన సమయం ఇది. క్షిపణికి క్షిపణి.. దాడికి దాడి సమాధానం కాదు. చర్చకు చర్చే సమాధానం. ఆయుధాలు సమస్యను వాయిదా వేయగలవేమో కానీ.. శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వగలిగేది దౌత్యమే. యుద్ధంలో ఎవరు గెలిచారన్నది చరిత్ర రాసుకోవచ్చు.. కానీ ప్రతి యుద్ధంలోనూ ముందుగా ఓడిపోయేది మానవత్వమే!

# శతాబ్దం దాటినా.. విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖి
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ



**ఢిల్లీ, సెప్టెంబర్ 5 (చురకలు):** దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ.. వందేళ్లుగా విద్యారంగానికి కళాశాల అందిస్తున్న సేవలను ప్రశంసించారు. వ్యాపారం, ప్రజాజీవితం, సామాజిక రంగాల్లో తరతరాల నాయకులను తీర్చిదిద్దడంలో ఈ విద్యాసంస్థ విశిష్టమైన ముద్ర వేసిందని కొనియాడారు. శతాబ్ది ఉత్సవాలకు ముందు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. విద్యా ప్రతిభ, సంస్థాగత నిర్మాణంలో శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. వందేళ్ల ప్రయాణంలో దేశ అభివృద్ధికి అవసరమైన ప్రతిభావంతులను అందించడంలో కళాశాల పాత్రను అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజునే శతాబ్ది ఉత్సవాలు జరగడం ప్రత్యేకతను సంతరించుకుంది. కళాశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ జెన్-జీ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల ఆలోచనలు, ఆకాంక్షలు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. యువత తమ అభిప్రాయాలను ప్రధానితో నేరుగా పంచుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యేందుకు ప్రధాని మోదీ ఢిల్లీ మెట్రోలో ప్రయాణించి కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. మెట్రో ప్రయాణంలో చిన్నారులు, మహిళలు, ఇతర ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రధానితో మాట్లాడేందుకు అవకాశం రావడంతో ప్రయాణికుల్లో ఉత్సాహం కనిపించింది. కామర్స్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ విద్యలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ 1926లో ఆవిర్భవించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత సర్ శ్రీరామ్ చొరవతో ఏర్పాటైన ఈ విద్యాసంస్థ వందేళ్ల ప్రయాణంలో అనేక రంగాలకు ప్రతిభావంతులను అందించింది. పారిశ్రామికవేత్తలు, పరిపాలనాధికారులు, విధాన నిర్ణేతలు, ప్రజాజీవితంలో ప్రముఖులుగా ఎదిగిన అనేక మంది ఈ కళాశాల నుంచి విద్యనభ్యసించారు. శతాబ్ది మైలురాయిని చేరుకున్న శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్.. గత వైభవాన్ని గుర్తుచేసుకుంటూనే కొత్తతరం విద్యార్థులతో మరో శతాబ్దపు ప్రయాణానికి అడుగుపెట్టింది.

# బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన
- దోషుల్లో ముగ్గురు మహిళలు




**జగదల్‌పూర్, సెప్టెంబర్ 5 (చురకలు):** ఛత్తీస్‌గఢ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన 2013 జీరమ్ లోయ మావోయిస్టు దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై జరిగిన ఈ దాడికి సంబంధించిన కేసులో ముగ్గురు మహిళలు సహా మొత్తం 10 మందిని జగదల్‌పూర్ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు దోషులుగా నిర్ధారించింది. ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ సింగ్ రాజ్‌పుత్ తీర్పు వెల్లడించారు. దోషులకు విధించే శిక్షలను సెప్టెంబర్ 16న ప్రకటించనున్నారు. 2013 మే 25న బస్తర్ ప్రాంతంలోని దర్భా పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీరమ్ లోయ వద్ద ఈ దాడి జరిగింది. కాంగ్రెస్ నిర్వహించిన 'పరివర్తన్ ర్యాలీ' ముగించుకుని నాయకులు తిరిగి వెళుతుండగా మావోయిస్టులు వారి కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, మాజీ ప్రతిపక్ష నేత మహేంద్ర కర్మ, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్‌తో పాటు పలువురు భద్రతా సిబ్బంది, పౌరులు ఈ దాడిలో మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా అనంతరం చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటన అప్పట్లో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నాయకత్వానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

### 101 మంది సాక్షుల విచారణ

తొలుత బస్తర్ పోలీసులు కేసు నమోదు చేయగా.. ఘటన తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఎన్ఐఏ 2014 సెప్టెంబర్‌లో జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసింది. విచారణలో భాగంగా 101 మంది సాక్షులను విచారించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన అంశాల పరిశీలనకు రెండు న్యాయ విచారణ కమిషన్లు కూడా ఏర్పాటయ్యాయి. ఏళ్ల తరబడి సాగిన విచారణ అనంతరం తాజాగా 10 మందిని దోషులుగా నిర్ధారిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. వారికి ఎంత మేర శిక్ష విధించాలన్న అంశంపై ఈ నెల 16న న్యాయస్థానం నిర్ణయం ప్రకటించనుంది.

### తీర్పుతో మళ్లీ రాజకీయ వేడి

కోర్టు తీర్పు నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. దర్యాప్తులో అనేక వాస్తవాలు వెలుగులోకి రాలేదని మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ ఆరోపించారు. అప్పటి ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు తగిన భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ ఆరోపణలను మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత రమణ్ సింగ్ తోసిపుచ్చారు. అత్యంత సున్నితమైన జీరమ్ లోయ దాడి అంశాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని ఆయన విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాజకీయ చరిత్రలో చెరగని విషాదంగా మిగిలిన జీరమ్ లోయ దాడి కేసులో 13 ఏళ్ల తర్వాత వెలువడిన ఈ తీర్పు కీలక ఘట్టంగా మారింది. ఇప్పుడు దోషులకు సెప్టెంబర్ 16న కోర్టు ఎలాంటి శిక్షలు విధిస్తుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

# పోలీసులకే సవాల్.. చివరకు కటకటాల్లోకి!

**సీజేపీ నిరసనల ఘటనలో ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్**

**దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు**

**బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య**

**ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్**

**కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (చురకలు):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూలైలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల సందర్భంగా జరిగిన దాడి వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. నిరసనల్లో పాల్గొన్న నిషు ఆజాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్ స్వతంత్ర భరద్వాజ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం తదుపరి విచారణ కోసం ఒక రోజు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. నిరసనల సమయంలో భరద్వాజ్ తన తండ్రి తలపై ఓ వస్తువుతో దాడి చేశాడని, దాంతో ఆయన గాయపడ్డారని నిషు ఆజాద్ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి భరద్వాజ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఓ నిరసనకారురాలి తండ్రిపై తాను దాడి చేసినట్లు భరద్వాజ్ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. బాధితుడి తలకు తీవ్ర గాయమై పెద్ద సంఖ్యలో కుట్లు పడి ఉండవచ్చని చెప్పాడు. అంతటితో ఆగకుండా.. అలాంటి దాడి హత్యాయత్నం పరిధిలోకి రావచ్చని పేర్కొంటూనే రాజకీయ పలుకుబడి కారణంగా పోలీసులు తనను అరెస్ట్ చేయలేదని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలతో కూడిన వీడియో వైరల్ కావడంతో పోలీసుల తీరుపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. భరద్వాజ్ వ్యాఖ్యలపై స్పందించిన నిషు ఆజాద్ సామాజిక మాధ్యమంలో వీడియో విడుదల చేశారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయడానికి నిరాకరించారని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కోరారు. సామాజిక మాధ్యమాల్లో తనను వేధించడంతో పాటు లైంగిక దాడి బెదిరింపులు కూడా వస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై రాజకీయ నేతలు కూడా స్పందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం సహా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని సంబంధిత నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని పరిశీలించాలని డిమాండ్లు వచ్చాయి. మరోవైపు నిషు ఆజాద్ ఆరోపణలపై పోలీసులు స్పందిస్తూ.. ఘటన సమయంలో బాధితుడికి స్వల్ప గాయాలైనట్లు ప్రాథమికంగా గుర్తించినందున అప్పట్లో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నట్లు సమాచారం. భరద్వాజ్ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలకు భిన్నమైన వాదన వినిపించాడు. ఘటన సమయంలో తనను 10 నుంచి 15 మంది చుట్టుముట్టారని, ఆ పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసమే దాడి చేయాల్సి వచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం పోలీసులు ఇరుపక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లష్కర్ కమాండర్ హతం

**భద్రతా దళాల మెరుపు దాడి**

**బద్గాంలో సంయుక్త ఆపరేషన్**



**శ్రీనగర్, సెప్టెంబర్ 5 (చురకలు):** జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్ పర్వత ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా దళాలు జరిపిన మెరుపు ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన కీలక పాకిస్థానీ కమాండర్ 'యాసిర్' హతమయ్యాడు. పర్వత ప్రాంతాల్లో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే పక్కా నిఘా సమాచారంతో భారత ఆర్మీకి చెందిన 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ బలగాలు సంయుక్తంగా తనిఖీ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాల రాకను గమనించి ఉగ్రవాది జరిపిన కాల్పులకు తిప్పికొట్టిన బలగాలు యాసిర్‌ను అక్కడికక్కడే మట్టుబెట్టాయి. భద్రతా వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. యాసిర్ గతంలో 2025 పహల్గామ్ దాడి సూత్రధారి, లష్కర్ ప్రసిద్ధ ఉగ్రవాది సులైమాన్ మూసా (హాషిమ్ మూసా) గ్రూప్‌లో కీలక సభ్యుడిగా పనిచేశాడు. ఏడాది క్రితం ఆ గ్రూప్ నుంచి విడిపోయిన యాసిర్, యూస్‌మార్గ్ ఎత్తైన పర్వత రహస్య ప్రాంతాల్లో ఉంటూ ప్రత్యేక ఉగ్ర నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడు. గత కొంతకాలంగా ఇతని కదలికలపై గూఢచారి వర్గాలు నిఘా ఉంచాయి. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర ఘటనలు, ప్లానింగ్‌లలో ఇతని ప్రమేయం ఉందా అన్న కోణంలో విచారణ ముమ్మరం చేశారు. శ్రీనగర్‌లోని దాచీగామ్ అటవీ ప్రాంతంలో సులైమాన్ మూసాను గతంలోనే భద్రతా దళాలు మట్టుబెట్టగా, ఇప్పుడు అతని ప్రధాన అనుచరుడు యాసిర్‌ను కూడా తుదముట్టించడంతో లష్కర్ నెట్‌వర్క్‌కు తీవ్ర విఘాతం కలిగింది.

# గురువే దేశ నిర్మాణానికి మార్గదర్శి

## ఉపాధ్యాయ వృత్తి దైవంతో సమానం

## గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సహస్ర హైస్కూల్‌లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువే దేశ నిర్మాణానికి మార్గదర్శి అని, ఉపాధ్యాయ వృత్తి దైవంతో సమానమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి అవసరమైన ఉత్తమ పౌరులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రవణ్ కుమార్, డైరెక్టర్ హారిక, ప్రిన్సిపల్ రాఘవేంద్ర చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జగదీశ్ రెడ్డి ఖబర్దార్

## టీడీపీ నాయకుల ఆగ్రహం



**దమ్మపేట, సెప్టెంబర్ 05, :**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి శుక్రవారం విలేఖరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై చేసిన విమర్శల పట్ల తీవ్ర అభ్యంతరాలు, నిరసనలు వెలువెత్తుతున్న సందర్భంలో శనివారం దమ్మపేట మండల తెలుగుదేశం కార్యాలయంలో టీడీపీ నాయకులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ నీ నాయకుడు ఫామ్ హౌస్ కి పరిమితయుండు, అసెంబ్లీకి రాడు, మీ నాయకుడు గురించి నీవు చూసుకో తెలుగుదేశం గురించి అతిగా ఎక్కువ మాట్లాడితే నీవు పోటీ చేసిన దగ్గర తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నిన్ను ఓడించే వరకు నిద్రపోరని అశ్వారావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ కట్రం స్వామి దొర హెచ్చరించారు. జగదీశ్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడినప్పటికీ సిగ్గు రాలేదని, మీ చీకటి ఒప్పందాలు ఆంధ్రప్రదేశ్లో జగన్మోహన్ రెడ్డితో పెట్టుకుంటే మీకు పుట్టగతులు లేకుండా పోతారని ఎద్దేవా చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మీకు 12 సీట్లు కూడా గెలవలేరని తెలుగుదేశం పార్టీపై విషం చిమ్మే నాయకులు గుర్తుంచుకోవాలనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు ఎండి వలీపాషా, తేళ్ల చెన్నయ్య, నార్లపాటి శ్రీనివాసరావు , పానుగంటి రామారావు, వారధి సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప, తెలుగుదేశం సీనియర్ నాయకులు గడ్డిపాటి సత్యం, తెల్లం రామారావు, కణితి లక్ష్మణ్ రావు తదితరులున్నారు.

# తులిప్స్ స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సిద్దిపేట నియోజకవర్గంలోని ఎన్సాన్ పల్లి గ్రామంలో గల తులిప్స్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులిప్స్ స్కూల్ కరస్పాండెంట్ తాటిపాముల కోటేశ్వర్, ప్రిన్సిపాల్ మిద్దె ప్రశంస, ప్రధానోపాధ్యాయులు బాలరాజు వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనదని పేర్కొన్నారు. స్కూల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉంటారని పిల్లలు భావిస్తారని, ఉపాధ్యాయులందరూ పిల్లలను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు క్రమశిక్షణతో విద్య బోధన చేస్తూ చక్కని పునాది వేయాలని సూచించారు. స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరినీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ గురువుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

# భీమసేన కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
గంభీర్‌పూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కరికే భీమసేన కుటుంబాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం పరామర్శించారు. భీమసేన సోదరుడు కరికే అజయ్‌కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం అజయ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై దామరకుంటలో బీఆర్ఎస్ వినూత్న నిరసన

- ఇంటింటికీ 'ప్రభుత్వ బాకీ కార్డుల' పంపిణీ
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏవీ.. ప్రజలకు సమాధానం చెప్పాలి..
- అధికారంలో ఉండి ధర్నాలు చేయడం కాంగ్రెస్ దివాళాకోరుతనానికి నిదర్శనం
- మాజీ ఎంపీటీసీ కృష్ణ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తి బాబు యాదవ్ ధ్వజం



**గజ్వేల్ ప్రతినిధి(మర్కుక్), సెప్టెంబర్ 05, :**
గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం దామరకుంటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ ప్రభుత్వం ప్రజలకు బాకీ పడ్డ పథకాలు, హామీల వివరాలతో కూడిన కార్డులను గ్రామంలోని ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కృష్ణ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తి బాబు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు గడుస్తున్నా, ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజలను మోసపూరిత మాటలతో నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ నేడు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ తమ ప్రభుత్వం అధికారంలో ఉండగానే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తుండడం హాస్యాస్పదంగా, సిగ్గుచేటుగా ఉందని విమర్శించారు. అధికార పార్టీలో ఉన్న నర్సారెడ్డికి నిజంగా దమ్ముంటే ప్రభుత్వంతో మాట్లాడి గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకురావాలని, ఆ పని చేతకాకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తప్ప కాంగ్రెస్ పార్టీ కొత్తగా సాధించిందేమీ లేదని తేల్చిచెప్పారు. ప్రస్తుత పాలనతో విసిగిపోయిన ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాయత్రి బాల నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ పత్తి ఆంజనేయులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పరిశుభ్రతే ప్రధాన లక్ష్యం

## మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
పట్టణ పరిశుభ్రతను ప్రధాన లక్ష్యంగా చేసుకుని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ శనివారం ఉదయం సైకిల్‌పై పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని 7వ వార్డులో గణపతి కుంటను పరిశీలించిన కమిషనర్, కుంట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం 27వ వార్డులో ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి మున్సిపల్ వాహనాలకు అందిస్తున్న విధానాన్ని గమనించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పట్టణ పరిశుభ్రత దెబ్బతింటుందని, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని సంబంధిత అధికారి శివకుమార్‌ను ఆదేశించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.



# విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే సౌజన్య

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి సుదర్శన్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎన్సాన్‌పల్లి గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ, విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను అలవర్చుకోవడంలో ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని కె సౌజన్య వివరించారు. న్యాయ అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఎం రవికుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ కే విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల మాటలను గౌరవంతో శ్రద్ధగా వినాలి

- విద్యార్థులకు సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచన

**చేర్యాల రూరల్, సెప్టెంబర్ 05, :**
విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్త్యాల గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే విషయాలను క్రమశిక్షణతో వినాలని సూచించారు. గురువుల పట్ల గౌరవం, విధేయత కలిగి ఉండటమే విద్యార్థులు వారికి అందించే నిజమైన బహుమతి అని పేర్కొన్నారు. ఆడపిల్లలు మానసికంగా, శారీరకంగా ధైర్యంగా ఉండాలని సీపీ సూచించారు. ప్రతి బాలిక ఆత్మరక్షణ విద్యను నేర్చుకుని, తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలని తెలిపారు. వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీస్ షీటీమ్స్‌కు సమాచారం అందించాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రష్మీ పెరుమాళ్ హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో పరిచయాలు పెంచుకోవద్దని, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ రమేష్, ఎస్సై అపూర్వ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యుత్ సబ్ స్టేషన్ లో లాగ్ బుక్ ను పరిశీలించిన మాజీ మంత్రి హరీష్ రావు

- 10 గంటలు విద్యుత్ సరఫరా అవుతుందని వెల్లడి
- విద్యుత్ శాఖ మంత్రి, సీఎం రాజీనామా చేయాలని డిమాండ్
- చీకోడ్ లో రైతుల ధర్నాకు హరీష్ రావు మద్దతు





**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక కేసీఆర్ రాజీనామా చేయాలని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెయ్యి రోజుల పాలన ఏమి చేతకాని నిస్సహాయ స్థితిలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్ పూర్ గ్రామంలో శనివారం విద్యుత్ సబ్ స్టేషన్ ను హరీష్ రావు ఆకస్మికంగా సందర్శించి, రికార్డులు పరిశీలించారు. రోజుకు కేవలం 10 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతుందని లాగ్ బుక్ మీడియాకు చూపించి వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క వెంటనే స్పందించి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతులకు కావాల్సిన యూరియా, 24 గంటల విద్యుత్ సరఫరా , రైతుబంధు అమలు చేయడంలో ప్రభుత్వం ఫెయిల్ కావడం జరిగిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి కాకుండా అక్రమ సంపాదన కోసం రేవంత్ రెడ్డి, తన కుటుంబం పనిచేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. అనంతరం యూరియా దొరకక చీకోడ్ గ్రామంలో రైతులు చేస్తున్న ధర్నాకు మాజీ మంత్రి హరీష్ రావు మద్దతు తెలిపారు. అన్నదాతకు అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిగోస పెడుతున్నారని వాపోయారు. ఒక్క యూరియా బస్తా కోసం రోజుల తరబడి రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. షాపుల్లో లేనటువంటి యూరియా ద్వారా యాప్ ల ద్వారా రైతులకు ఎలా అందుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డట్టు చరిత్రలో లేదని, రాబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులు ఓటుతో గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో పాటు బిఆర్ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

# సిద్దిపేట నా కుటుంబం.. మీరంతా నా పిల్లలే..

- విద్యార్థులు తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
సిద్దిపేట తన కుటుంబమని, ఇక్కడి విద్యార్థులంతా తన పిల్లలేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని సూచించారు.శనివారం సిద్దిపేటలోని విపంచి ఆడిటోరియంలో ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని, సెల్‌ఫోన్‌కు బానిసలు కావొద్దని సూచించారు. పుస్తక పఠనం జ్ఞానాన్ని పెంచుతుందని, చిన్న వయస్సు నుంచే పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని అన్నారు. ఐదేళ్లు కష్టపడి చదివితే జీవితాంతం మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. సిద్దిపేట అభివృద్ధిలో విద్య, వైద్యానికి తాను ఎంతో ప్రాధాన్యం ఇచ్చానని హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేటలో అన్ని రకాల విద్యా కోర్సులు అందుబాటులో ఉండాలన్నదే తన లక్ష్యమన్నారు. మెడికల్ కళాశాలతో పాటు ఇతర విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేశానని చెప్పారు. నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కళాశాల పనులు ప్రభుత్వం మారిన తర్వాత నిలిచిపోయాయని, కళాశాలను కొడంగల్‌కు తరలించారని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సమయం నడుస్తోందని, భవిష్యత్తులో మళ్లీ తన సమయం వస్తుందని అన్నారు. అప్పుడు సిద్దిపేటను మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పేద విద్యార్థులు వైద్య విద్య చదివేందుకు సహాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. "సీటు సాధించడం మీ వంతు.. ఫీజు బాధ్యత నాది".. అని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. తన ప్రాణం ఉన్నంత వరకు సిద్దిపేట అభివృద్ధికి కృషి చేస్తానని హరీశ్‌రావు స్పష్టం చేశారు.



# అంక్షాపూర్‌లో జై గౌడ్ ఉద్యమం గ్రామ కమిటీ ఏర్పాటు

**నంగునూరు, సెప్టెంబర్ 05, :**
సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలం అంక్షాపూర్ గ్రామంలో శనివారం జై గౌడ్ ఉద్యమం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ గౌడ సంఘం సభ్యుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో బందారం ఎల్లయ్య గౌడ్‌ను అధ్యక్షుడిగా, పంజాల రవి గౌడ్‌ను ఉపాధ్యక్షుడిగా, బాలగోని రాజు గౌడ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. యూత్ అధ్యక్షుడిగా బంధారం రవి గౌడ్, ఉపాధ్యక్షుడిగా భూమయ్య గౌడ్‌ను నియమించారు. జై గౌడ్ ఉద్యమం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంధపు హరి గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు జరిగింది. మాజీ సర్పంచ్ నెమలి సుభాష్ గౌడ్, జర్నలిస్ట్ ముస్కీర్ పరుశురాం గౌడ్ సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గౌడ పెద్దల సూచనలను గౌరవిస్తూ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని, యువత భాగస్వామ్యంతో గౌడుల ఐక్యతను బలోపేతం చేయాలని అన్నారు. గౌడుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడటంతో పాటు రాజకీయ అవకాశాలను పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గౌడ సమాజం నుంచి మరింత మంది చట్టసభలకు ప్రాతినిధ్యం వహించేలా కృషి చేయాలని, హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని పేర్కొన్నారు. గౌడ పెద్దలు, యువత, మహిళలు, ఉద్యోగ సంఘాల నాయకులను ఉద్యమంలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. అన్ని జిల్లాల్లో ఉద్యమ కమిటీలను పునర్వ్యవస్థీకరించి, ఉద్యమం కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వడంతో పాటు కొత్తవారికి అవకాశం కల్పించనున్నట్లు నాయకులు తెలిపారు. ప్రచార కమిటీతో పాటు వివిధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



# జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
సిద్దిపేట జిల్లా కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి సుదర్శన్ పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ఏర్పాట్లలో భాగంగా శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి సుదర్శన్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు త్వరితగతిన, సులభంగా, తక్కువ ఖర్చుతో న్యాయం లభిస్తుందని తెలిపారు. పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధన వ్యయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యను తగ్గించేందుకు లోక్‌అదాలత్‌లు ఎంతగానో దోహదపడతాయన్నారు.పోలీసు శాఖ పరిధిలో రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో చర్చించి పరస్పర అంగీకారంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ లోక్‌అదాలత్ విజయవంతానికి పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై జయప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె సౌజన్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.




# 35 ఏళ్లైనా గురువులను మరువని పూర్వ విద్యార్థులు

## ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఘన సన్మానం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా 35 ఏళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించుకుని, వారి ఆశీర్వాదాలు పొందారు. 1984-85 విద్యా సంవత్సరంలో 7వ తరగతిలో తమకు విద్యాబోధన చేసిన పన్యాల ఎల్లారెడ్డిని, 1988-89 విద్యా సంవత్సరంలో విద్యాబోధన చేసిన బాల్ లింగంను పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా పయ్యావుల ఎల్లం యాదవ్, అంబడిపల్లి భాస్కర్, బోర మధుసూదన్ తదితరులు గురువులను సత్కరించి, వారి దీవెనలు పొందారు. చిన్ననాటి విద్యార్థి దశలో తమకు జ్ఞానాన్ని అందించిన గురువులను ఇన్నేళ్ల తర్వాత కూడా మరువకుండా కలుసుకోవడం పూర్వ విద్యార్థులకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. '35 ఏళ్లు గడిచినా మమ్మల్ని మరువకుండా సన్మానించేందుకు వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది' అని గురువులు ఆప్యాయంగా పలకరించడం పూర్వ విద్యార్థులను భావోద్వేగానికి గురిచేసింది. గురువుల ఆశీర్వాదాలు తమ జీవితాలకు ఎప్పటికీ మార్గదర్శకమని వారు పేర్కొన్నారు. గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతలకు ప్రతీకగా నిలిచిన ఈ ఆత్మీయ కలయిక అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# పారాబాయిల్డ్ రైస్ మిల్లర్ల ఆందోళన

- ఎమ్మెల్యేకు వినతి పత్రం
- సిఎంఆర్ డెలివరీ నిలిచిపోవడంతో మిల్లుల మూసివేత దిశగా అడుగులు

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 5, :**
ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ ఉంచడం, సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ చేయడానికి గోదాముల్లో స్థలం లేకపోవడంతో సిద్దిపేట జిల్లాలో రైస్ మిల్లులు పూర్తిగా బంద్ అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా రూరల్ పారాబాయిల్డ్ మిల్లర్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం హబ్సీపూర్ లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చింత రాజు మాట్లాడుతూ సీఎంఆర్ డెలివరీలో సంవత్సరాల తరబడి ఆలస్యం కావడం వల్ల మిల్లుల్లో ఉన్న ధాన్యం విపరీతంగా డ్యామేజ్ అవుతోంది. దీనివల్ల ఎఫ్‌సీఐ ఈ బియ్యాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని. ఫలితంగా 15 నుండి 20 శాతం వరకు రిజెక్షన్ వస్తుండటంతో, మిల్లర్లు తీవ్ర నష్టాలను చవిచూస్తూ ఇథనాల్ ప్లాంట్‌లకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. యాసంగి పంటలో నూకల శాతం ఎక్కువగా ఉంటుందని, కానీ ఎఫ్‌సీఐ మాత్రం రా రైస్ మాత్రమే పెట్టాలని నిబంధనలు విధిస్తున్నారని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత నిల్వలు పూర్తిగా క్లియర్ అయిన తర్వాతే తదుపరి దిగుమతులు చేసుకుంటామని స్పష్టం చేశారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన టెండర్ ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో సిద్దిపేట జిల్లాకు ఇప్పటివరకు 95 శాతం పేమెంట్లు పూర్తయినప్పటికీ, ఎఫ్‌సీఐలో స్థలం లేకపోవడం వల్ల నిల్వలు పేరుకుపోయాయి. తాము పేమెంట్లు చేయడానికి సిద్ధంగా ఉన్నా, టెండర్ ప్రక్రియ పూర్తి చేయకుండా మిల్లులపై విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ దాడులు చేయిస్తున్నారని మిల్లర్లు ఆరోపించారు. ఈ సమస్యల వల్లే రాబోయే సంవత్సరాల్లో సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లుల్లో దించుకోవడానికి నిరాకరించే పరిస్థితి వస్తుందని, కావున ఈ వ్యవహారాన్ని అత్యంత తక్షణ సమస్యగా గుర్తించి తమకు న్యాయం చేయాలని రైస్ మిల్లర్లు ఎమ్మెల్యేను కోరారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వికేడివి కళాశాల టీచర్స్ కు సన్మానం



**అశ్వారావుపేట ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** అశ్వారావుపేట లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5 వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వికేడివి కళాశాల నందు టీచర్స్ కు శనివారం ఘనంగా టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసి లయన్స్ క్లబ్ తరపున సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది టీచర్స్ కి ఘనంగా సన్మానం చేసి గురుపూజోత్సవము ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. పిల్లలు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్కినేని నరేంద్రబాబు, సెక్రెటరీ బలమూరి సూర్యరావు, ట్రెజరర్ జూపల్లి బ్రహ్మారావు, సీనియర్ లయన్ మెంబర్స్ దారా మల్లికార్జునరావు, లయన్ అత్యం వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ శేషు బాబు, జల్లిపల్లి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలో హోలియ దాసరి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ ప్రారంభోత్సవం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 05, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని భద్రసాయి నగర్ లో హోలియ దాసరి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులు యాకయ్య ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హ్యాట్రిక్ ఎమ్మెల్యే విచ్చేసి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుంట సిద్దిరాములు, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, యూత్ నాయకులు కె.పి. వినయ్ గౌడ్ మరియు అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసోసియేషన్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు.

# అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

## దర్శించుకున్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 04, :**
జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో నాయిని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు వార్డు ప్రజలు, భగవద్బాంధవులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. నాయిని బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, వార్డు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న గంగుల అంజలి యాదవ్

## ధర్మం, న్యాయం, సత్యం వైపు శ్రీకృష్ణుడి బోధనలు మార్గదర్శకం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 05, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు శనివారం ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ హాజరై, భక్తులతో కలిసి శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి బోధనలు ధర్మం, న్యాయం, సత్యం వైపు నడిపించే గొప్ప మార్గదర్శకాలని అన్నారు. ప్రజా సేవలోనూ శ్రీకృష్ణుడి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. "ధర్మం కోసం అడుగు.. ప్రజల కోసం పోరాటం.. కుత్బుల్లాపూర్ అభివృద్ధి కోసం నిరంతరం ముందుకు సాగుదాం" అని ఆమె అన్నారు. వేడుకల్లో భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడి నామస్మరణతో సందడి చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.



చురకలు



# దమ్మపేట మండల ఉత్తమ ఉపాధ్యాయురాలు నాగమణికి సన్మానం

**దమ్మపేట, సెప్టెంబర్ 05, :** సెప్టెంబర్ 05 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దమ్మపేట పి.యం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, సర్పంచ్ పగడాల రమాదేవి, ప్రధానోపాధ్యయురాలు ఉషారాణి, ఎం.ఇ.ఓ జగపతి, ఎం.పి.డి.ఓ రవీందర్ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా నాగమణి ఎంపిక కావడం హర్షనీయం అని ప్రశంసించి శాలువాతో సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంతో పాటు వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని సర్పంచ్ రమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు ఉపాధ్యాయులు అత్తిలి శ్రీనివాసరావు ను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయులను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా సన్మానించడం వారి నిస్వార్ధ సేవలకు, సమాజ నిర్మాణంలో వారు అందించే కృషికి ఇచ్చే గౌరవం అన్నారు. ఉపాధ్యాయ దంపతులు అత్తిలి శ్రీనివాసరావు నాగమణి ఇరువురు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.



# టీచర్స్ డే సందర్భంగా ఎస్వీఆర్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** టీచర్స్ డే సందర్భంగా దూలపల్లిలోని శ్రీ ఎస్వీఆర్ గ్లోబల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో మాక్ టీచర్స్ (విద్యార్థులు ఉపాధ్యాయులుగా) మరియు ఉపాధ్యాయులు కలిసి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సొంటి రెడ్డి పున్నారెడ్డి గారు మాట్లాడుతూ.. "ఒక విద్యార్థి భవిష్యత్తులో కలెక్టర్ కావాలన్నా, రాజకీయ నాయకుడిగా ఎదగాలన్నా, గొప్ప బిజినెస్ మ్యాన్, డాక్టర్, ఇంజనీర్ లేదా మరేదైనా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నా – ఆ విజయానికి పునాది వేసేది ఉపాధ్యాయులే. విద్యార్థుల్లో జ్ఞానాన్ని నింపడమే కాకుండా, మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించి సమాజానికి ఉత్తమ పౌరులను అందించేది ఉపాధ్యాయులే. అందుకే సమాజం అభివృద్ధి చెందాలన్నా, దేశం మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్నా అది ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యం. ఉపాధ్యాయులను గౌరవించడం అంటే జ్ఞానాన్ని, భవిష్యత్తును గౌరవించడమే" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మాక్ టీచర్స్ గా వ్యవహరించిన విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 275వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- అభివృద్ధి పనులకు ప్రాధాన్యత: కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** నియోజకవర్గ పరిధిలోని 275వ డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి హాజరై సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. రోడ్ల అభివృద్ధితో స్థానిక ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తొలగి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు కృషి చేస్తున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతాం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన నిరుద్యోగుల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థుల చదువులు ఇబ్బందుల్లో పడుతున్నాయని అన్నారు. కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా కొనసాగించాలని, ఈ అంశంపై అసెంబ్లీలో గట్టిగా పోరాడుతానని హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో స్పష్టమైన ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సిద్దిపేటకు గతంలో తీసుకొచ్చిన విద్యాసంస్థలు, అభివృద్ధి పనులను ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కళాశాలను ఇతర ప్రాంతానికి తరలించడం సరికాదన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టకుండా వారి సమస్యలను పరిష్కరించాలని పోలీసులకు సూచించారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని, హామీలను అమలు చేయడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత తరపున అసెంబ్లీలోనూ, ప్రజాక్షేత్రంలోనూ తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.



# రైతుల పాలిట రాక్షసుడిగా మారిన సీఎం రేవంత్ రెడ్డి

- కరువు రాలేదు.. రేవంత్ కరువు తెచ్చిండు..
- మోడీ బడేబాయ్.. రేవంత్ చోటబాయ్..
- బీజేపీ కాంగ్రెస్ దొందూ దొందే
- రేవంత్ సర్కార్ పై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీష్ రావు
- రైతు పొలికేక మహా ధర్నాకు హరీష్ రావు సంఘీభావం

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పాలిట రాక్షసుడిగా మారాడని, షాపుల్లో లేని యూరియా యాపుల్లో ఎట్లా ఉంటుందో చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ప్రశ్నించారు. శనివారం దుబ్బాక మండలం హబ్సిపూర్‌లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు పొలికేక మహాధర్నాలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల కోసం 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధు, రైతుబీమా, ఎరువులు అందించి రైతు బాంధవుడిగా నిలిచారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రైతులను అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పాలిట రాక్షసుడిగా మారారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతు బిడ్డగా కేసీఆర్‌కు ఉన్న ప్రేమ రేవంత్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతుబంధు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని, నేడు రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి తిరగాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. కేసీఆర్ పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడాను రైతులు, ప్రజలు గమనించాలని కోరారు. ఉచిత కరెంట్ అంటే అంత ఉత్త కరెంటు అన్నారు. రైతు బీమా రైతులకు కొండంత ధీమా అని రైతు చనిపోతే తన దశదినకర్మ లోపు ఐదు లక్షల రైతు బీమా ఇచ్చిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. క్వింటాలకు 5 కిలోల తరుగును తీసేసిన ఘనత రేవంత్ రెడ్డి అని నాడు తరుగుతీస్తే తోలు తీస్తా అన్న రేవంత్ రెడ్డి నేడు రైస్ మిల్లర్ల చేతిలో కీలు ఉన్నదా మారారని విమర్శించారు. రైతులను రాబందుల పీక్క తింటున్నావని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు వచ్చింది కరువు కాదని, సీఎం రేవంత్ రెడ్డి తెచ్చిన కరువేనని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లో ఏం చేశావని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి దేవుళ్ళ మీద ఒట్టేసి ఇచ్చిన హామీలు బూడిదలో పన్నీర్ అయ్యాయని అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ఏ ఒక్క కొత్త పింఛన్ ఇచ్చావా అని ప్రశ్నించారు. రైతుభీమా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం 29 వేల కోట్లు రైతులను ముంచిందని అన్నారు. ఎన్నికల ముందు మరో కొత్త పథకాలు తెచ్చి ప్రజలను మోసం చేసి ఓటు దండుకోవాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని అన్నారు. కేంద్రంలో మోడీ సర్కారు ఎరువుల ధరను పెంచి రైతులపై భారం మోపిందన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ బడే బాయిగా.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చోటే బాయిగా మారారని అన్నారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ మాత్రమే శ్రీరామరక్ష అని తెలిపారు. నాడు మోసపోయామని వచ్చే ఎన్నికల్లో మోసపోయి గోస పడవద్దని హరీష్ రావు స్పష్టం చేశారు. ఈ నెల 7 నుంచి జరిగే అసెంబ్లీలో రైతుల పక్షాన పోరాటం చేస్తానని తెలిపారు.

### దొంగ హామీల పేరుతో ప్రజలను మోసం.. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, దొంగ హామీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు అందిస్తే, ప్రస్తుతం ఉన్న నీటిని కూడా రైతులకు సక్రమంగా అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గంలో సాగునీటి ఉపకాలువల నిర్మాణం చేపట్టాలని, ఇప్పటికే ఉన్న కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, సాగునీరు, ఎరువులు, ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులతో కలిసి వంటా-వార్పు తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల హక్కుల కోసం వంటా-వార్పు కార్యక్రమాలు నిర్వహించామని, ఇప్పుడు రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి వంటా-వార్పు చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. రైతుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రైతులతో కలిసి వంటా-వార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు స్వయంగా భోజనం వడ్డించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధా కిషన్ శర్మ, రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, బొంపల్లి మనోహర్ రావు, సోలిపేట సతీష్ రెడ్డి, మామిడి మోహన్ రెడ్డి, రొట్టె రాజమౌళి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్మన్ సులోచన స్వామి, నియోజకవర్గంలోని తాజా, మాజీ జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, దుబ్బాక మున్సిపల్ కౌన్సిలర్లు రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

- ఎస్సీ సెల్ బాధ్యులకు డాక్టర్ కవ్వంపల్లి పిలుపు
- కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియామక పత్రాల అందజేత

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 05, :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల దరికి చేరేలా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం బాధ్యులు కృషి చేయాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, ఉద్దేశం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కరీంనగర్ జిల్లా కార్యవర్గంతోపాటు వివిధ మండలాల అధ్యక్షులను టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో నూతనంగా నియమితులైన జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్షులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు.

### ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ

ప్రభుత్వం వివిధ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, ఈ పథకాల ద్వారా ఆయా వర్గాలు లబ్ధిపొందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా దళితులకు ఉద్దేశించిన పథకాలు వారి దరికి చేరేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో ఎస్సీ సెల్ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఎస్సీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రజలకు చేరవేయడంతోపాటు, ఎస్సీ వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, ఎస్సీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత నూతనంగా నియమితులైన నాయకులపై ఉందన్నారు. ప్రతి మండలంలో ఎస్సీ వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీకి అంకితభావంతో పనిచేసే వారికి కాంగ్రెస్‌లో సముచిత గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నూతనంగా నియమితులైన నాయకులు తమపై ఉంచిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

### జిల్లా కార్యవర్గం

ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్లుగా దుబ్బాసి కుమార్, గొట్టె బాబు ప్రణవ్, అస్తపురం రమేశ్, జుంజుపల్లి వివేక్, రెడ్డిగాని రాజు, ఎర్ర రవీందర్, ప్రధాన కార్యదర్శులుగా కనకం విద్యాసాగర్, వెదిరె విజేందర్, విల్సన్, దొడ్డి శ్రీకాంత్, బత్తుల రాజ్ కుమార్, కర్నె శ్రీహరి, కార్యదర్శులుగా అకినెపల్లి వెంకటేశ్, జిన్నారపు శ్రీకాంత్, సుకాసి యాదగిరి, బొజ్జ చంద్రమౌళి, గడ్డం సంపత్, ఎడ్ల అఖిల్ నియామకమయ్యారు. అలాగే ఎస్సీ సెల్ మండల అధ్యక్షులుగా కనకం అశోక్(మానకొండూర్), ఎలుక రాజు(తిమ్మాపూర్), మాతంగి అనిల్ (గన్నేరువరం), మీసాల సాయిలు (కరీంనగర్), ఇల్లందుల శ్రీనివాస్ (హుజూరాబాద్), దొగ్గాల భాస్కర్ (జమ్మికుంట), గూడెపు ఓదెలు (ఇల్లందకుంట), బోయిని విద్యాసాగర్ (వీణవంక), పి.అనిల్ (జమ్మికుంట), రేణికుంట్ల సందీప్ ( హుజూరాబాద్ టౌన్) నియామకయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ కొరివి అరుణ్ కుమార్, వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులదే
- డైరెక్టర్ సిహెచ్ సత్యం



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** సిద్ధిపేటలోని శ్రీవాణి స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్ సత్యం మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, మంచి విలువలు, క్రమశిక్షణ, మానవతా దృక్పథం, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు.భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యారంగానికి రాధాకృష్ణన్ అందించిన సేవలు, ఆయన ఆలోచనలు నేటి ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవం, కృతజ్ఞతలను చాటుకునేందుకు ఉపాధ్యాయ దినోత్సవం ఒక గొప్ప సందర్భమని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర తల్లిదండ్రుల తర్వాత అత్యంత ప్రాధాన్యమైనదని సత్యం అన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, నిరంతర మార్గదర్శకత్వం, ప్రోత్సాహం ఎంతో ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, భావితరాల భవిష్యత్తును నిర్మించే మహత్తర బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు తమ ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరిస్తూ ప్రసంగాలు చేశారు. ఉపాధ్యాయుల పట్ల తమకున్న గౌరవం, ప్రేమను వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సైతం ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతను, తమ బోధనా అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కాగా, ఉపాధ్యాయ దినోత్సవానికి ముందురోజు పాఠశాలలో ఉపాధ్యాయులకు వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమలోని క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు. విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆనందం, ఉత్సాహాన్ని నింపాయి.

# ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**జగిత్యాల/ధర్మపురి, సెప్టెంబర్ 05, :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పర్యటిస్తారని తెలిపారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్ నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ధర్మపురి చేరుకుంటారని మంత్రి తెలిపారు. ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి గార్డెన్స్ లో నిర్వహించే సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొంటారని మంత్రి వివరించారు. ఆదివారం రాత్రి ధర్మపురిలో బస చేసి సోమవారం తెల్లవారు జామున 2గంటల 30నిముషాలకు ధర్మపురిలో రూ.10కోట్లతో ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులను భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్ నిర్మాణ పూజ అనంతరం ఉప ముఖ్యమంత్రి సోమవారం ఉదయం 5గంటల 30నిముషాలకు తిరిగి హైదరాబాద్ బయలుదేరుతారని మంత్రి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనను ధర్మపురి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

**మంత్రి తన్నీరు హరీశ్ రావు**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** ఉపాధ్యాయులు సమాజాన్ని సన్మార్గంలో నడిపించే గురువులని, వారందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట ఎన్జీవో భవన్‌లో శనివారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సన్మాన గ్రహీతలను సత్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ గురువులను త్రిమూర్తులతో సమానంగా భావించి గౌరవిస్తామని అన్నారు. సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులను సన్మానించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఉద్యోగుల వేతనాల నుంచి ప్రతి నెలా డబ్బులు కట్ చేస్తున్నప్పటికీ, ఈహెచ్ఎస్ ద్వారా సరైన వైద్య సేవలు అందడం లేదని అన్నారు. ప్రభుత్వం తన వాటా చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఆస్పత్రులకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించి ఉద్యోగులకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కోసం ఉద్యోగులు మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారని, డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. డీఎస్సీ నియామకాలు కూడా చేపట్టడం లేదని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై కూడా హరీశ్ రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన 'మన ఊరు—మన బడి' కార్యక్రమంతో పాఠశాలల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను కొనసాగించకపోవడం బాధాకరమన్నారు. పాఠశాలలకు అవసరమైన గ్రాంట్లు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని కోరారు. విద్యా సంవత్సరం



ప్రారంభమై నెలలు గడుస్తున్నా విద్యార్థులకు పాఠశాల యూనిఫాంలు అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అనంతరం వినాయక చవితి సందర్భంగా ప్రజలకు హరీశ్ రావు పిలుపునిచ్చారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేయడం కంటే భక్తితో పూజించడం ముఖ్యమని అన్నారు. చెరువులు, పర్యావరణం కలుషితం కాకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# జిల్లా యంత్రాంగం వైద్య శాఖను అప్రమత్తం చేయాలి

- టిఆర్ఎస్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్




**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** కరీంనగర్ జిల్లాలో తీవ్రమైన జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా యంత్రాంగం వెంటనే ప్రభుత్వ హాస్పిటల్ వైద్య శాఖను అప్రమత్తం చెయ్యాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేకమైన దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధుల కారణంగా ప్రజలు అనేకమైన జ్వరాలు, వైరల్ ఇన్ఫెక్షన్లతో ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు అనేక మంది ప్రజలు జ్వరాలతో ప్రభుత్వ ఆసుపత్రులు కిటకిటలడుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అవసరమైన మందులు, రక్త పరీక్షలు, డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ప్రయివేట్ హాస్పిటల్ ను కూడ ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చెయ్యాలని చిన్న జ్వరం అని పోతేనే లక్షల్లో ఫీజులు వసులు చేస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే స్థోమత లేని వాళ్ళు ప్రభుత్వ ఆసుపత్రుల పైనే ఆధార పడుతున్నారని అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా 24 గంటల వైద్య సేవలు మరియు సరిపడా మందులు, పరీక్షల కోసం సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తుందని అన్నారు. అదేవిధంగా జ్వరాలు పెరగడానికి కారణమయ్యే దోమల నివారణకు ఫాగింగ్, దోమల మందు పిచికారీ, నిల్వ నీటి తొలగింపు, పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలతో పాటు ప్రతి పట్టణం, గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. ప్రజల ఆరోగ్యాన్ని కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో వైద్య సేవలు మెరుగుపరచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తోంది తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

# 22-ఏ నిషేధిత భూముల సమస్యపై బీజేపీ మహా దీక్ష

- నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో భారీగా తరలివెళ్లిన వడ్డేపల్లి రాజేశ్వరరావు





**కూకట్ పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** 22-ఏ నిషేధిత భూముల జాబితా నుంచి రైతుల సామాన్యుల భూములను తొలగించి వారికి న్యాయం చేయాలని, భూ భారతి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద శనివారం నిర్వహించిన మహా దీక్షకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీగా తరలివెళ్లి దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు మహా దీక్షను ఉద్దేశించి మాట్లాడుతూ 22-ఏ నిషేధిత భూముల జాబితాలో రైతులు, సామాన్యుల భూములు ఉండటం వల్ల సంవత్సరాలుగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ సొంత భూములపై హక్కులు ఉన్నప్పటికీ వాటిని విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్ చేసుకోలేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతుల భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి, వారికి సంపూర్ణ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనీ అలాగే భూ భారతి పోర్టల్‌లో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను కూడ వెంటనే పరిష్కరించి రైతులకు సులభంగా భూ సంబంధిత సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వారి సమస్యలకు పారదర్శకంగా పరిష్కారం చూపాలి తెలియజేశారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ రైతులు, సామాన్యుల భూముల విషయంలో ఎలాంటి అన్యాయం జరిగినా భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని, రైతుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుందన్నారు. 22-ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం అని రాజేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళా నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- ఉపాధ్యాయుడు జీవిత మార్గదర్శి
- ఉపాధ్యాయుడు లేని సమాజాన్ని ఊహించలేం
- "భారతరత్న" డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు నేటికీ ఆదర్శం
- వారి మార్గదర్శకాలను పాటించిన వారు బోధనా రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు

**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 05, :** ఉపాధ్యాయుడు సమాజంలో మార్పు తీసుకురావడానికి నాంది పలుకుతాడని, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేశక్తి అతడికే ఉంటుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్, వూట్కూరి నరేందర్ రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవం "భారతరత్న" డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కరీంనగర్ లోని అల్ఫోర్స్ విద్యాసంస్థలు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్, భగత్ నగర్ లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో, మంకమ్మ తోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్ లో, వావిలాలపల్లిలోని టైనీ టాట్స్ లో, అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ (ఎస్6 క్యాంపస్) కిసాన్ నగర్ లోని అల్ఫోర్స్ స్కూల్ లో, విద్యారణ్యపురిలోని అల్ఫోర్స్ కిడ్స్ జీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు వేడుకల ప్రారంభోత్సవానికి ముందు వారు ప్రాంగణాల్లో ఏర్పాటు చేసినటువంటి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మార్పు ఉపాధ్యాయుల తోటే సాధ్యమవుతుందని, వారు విద్యార్థులను అన్ని రంగాలలో ముందంజలో నిలపడానికి కృషి చేస్తారని మరియు వారు లేని సమాజాన్ని ఊహించలేమని వారు చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ రెండో రాష్ట్రపతిగా విశిష్టమైన సేవలను అందించారని, వారి సేవలకు గుర్తింపు గాను భారతదేశ అత్యున్నత పురస్కారమైన "భారత రత్న"ను ప్రధానం చేశారని విద్యార్థులు అందరూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, వారు అవలంబించిన బోధనా విధానం నేటికీ ఆచరణలో ఉండడం వారి అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. వేడుకలలో భాగంగా పాఠశాలల్లో సెల్ఫ్ గవర్నమెంట్ డే నిర్వహించి విద్యార్థులకు బోధించే అవకాశం అందించి వేడుకలకు




వన్నె తెచ్చారు. అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. విద్యారంగానికి విశేషంగా కృషి చేయడమే కాకుండా ఎంతో మంది విద్యార్థులను అత్యుత్తమ స్థానాలలో స్థిరపరుస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న నరేందర్ రెడ్డిని ఉపాధ్యాయులందరూ ఆప్యాయతతో సత్కరించి వారి యొక్క అభిమానాన్ని చాటుకున్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానంగా గురువే లోకం, గురువు లేని లోకాన్ని ఊహించలేము, గురు బ్రహ్మ,గురు, విష్ణు తదితర నృత్య ప్రదర్శనలు ఆకర్షించాయి. ఈ వేడుకలలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీలోజిపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05,:** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నాగరాజు (28) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాగరాజు జీవితంపై విరక్తితో ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.నాగరాజు తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతుడి తండ్రి ఎర్ర కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోయినపల్లి ఏఎస్ఐ కె. గంగరాజు తెలిపారు.



## 22-ఏ బాధితులకు మద్దతుగా ఇందిరాపార్క్ వద్ద దీక్ష - పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 05, :** 22–ఏ భూ బాధితుల హక్కుల సాధన కోసం శనివారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన నిరవధిక పోరాట దీక్షలో మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 22–ఏ చట్టం పేరుతో పేదల భూములను లాక్కోవడం, రైతులు, బడుగు బలహీన వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని అన్నారు. భూమి హక్కు ప్రతి పేదవాడి జన్మహక్కు అని, దాని కోసం బీజేపీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. "భూమి హక్కు కోసం.. న్యాయం కోసం బీజేపీ పోరాటం ఆగదు. ప్రభుత్వం వెంటనే 22–ఏ బాధితుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలి, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని ఆయన హెచ్చరించారు. ఈ దీక్షలో పలువురు బాధితులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా జై గణేశ భక్తి సమితి మట్టి గణపతి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

- ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణహిత గణేశ్ ఉత్సవాలకు పిలుపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 05, :** ఆధ్యాత్మికతకు సేవా భావం తోడైతే పండుగలు మరింత వైభవంగా నిర్వహించవచ్చని, భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జై గణేశ భక్తి సమితి ప్రతినిధులు పిలుపునిచ్చారు. జై గణేశ భక్తి సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 11వ సంవత్సరం మట్టి గణపతి మహాగణపతి ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్సీ భోగ్గరపు దయానంద్ గుప్తా, చైర్మన్ కె. ఎస్. ఆనంద్ రావు, వైస్ చైర్మన్ గంగుల అంజలి యాదవ్, అధ్యక్షులు ఏ. జైన్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించేందుకు సమితి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా ఈ ఏడాది ప్రతి గణేష్ మండపంలో మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. మట్టి గణపతి విగ్రహాల ప్రతిష్ఠ ద్వారా భక్తి భావాన్ని కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని పేర్కొన్నారు. ప్రజల ఐక్యత, సేవా సంకల్పం, భక్తి భావాలతో జై గణేశ భక్తి సమితి గత 11 సంవత్సరాలుగా ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. "మన గణపతి – మన భక్తి – మన పర్యావరణం" అనే సందేశంతో ఈ ఏడాది ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం అధ్యక్షులు వెంకట్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ప్రసాదు తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలనకు ప్రజల హర్షం.. కుత్బుల్లాపూర్ లో భారీ బైక్ ర్యాలీ



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** కాంగ్రెస్ ప్రజా పాలనకు 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 286వ డివిజన్ కుత్బుల్లాపూర్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ నియోజకవర్గంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. అనంతరం జరిగిన సభలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, జిల్లా కార్యదర్శి జాకీర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు బాలప్ప, కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు పిట్ల ప్రవీణ్ కుమార్, గడ్డం రాజేందర్ రెడ్డి, బండి శ్రీనివాస్ గౌడ్, రాధాకృష్ణ, సుజాత యాదవ్, రంగయ్య, బేకు శ్రీనివాస్, గుమ్మడి మధుసూదన్ రాజు, అశ్విని, పద్మ, రేష్మ, అంజయ్య, ఆనంద్, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్సీ రమణ



**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ (వర్తక సంఘం) అధ్యక్షులుగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శిగా సామ సునీల్ కుమార్లు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శాసనమండలి ఉపనేత , ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణని జగిత్యాల వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ ఎల్ రమణ అభినందించారు.

# వెయ్యి రోజుల్లో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెయ్యి రోజుల్లోనే అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలనపై ప్రజలకు నమ్మకం కలిగిందని పేర్కొన్నారు. సిద్దిపేటలోని ముస్తాబాద్ ఎక్స్‌రోడ్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన మోసాలను వివరిస్తూ 'బీఆర్ఎస్ దోఖా కార్డులు' పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుకుంటూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేయని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లోనే చేపట్టిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన పనులపై బీఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. సిద్దిపేటలో బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గుతోందని, కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తోందని అత్తు ఇమామ్ పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలుసని, బీఆర్ఎస్ నాయకుల విమర్శలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దం లక్ష్మి , కలిముద్దీన్, రాశాద్, గ్యాదరి మధు, వహాబ్, గయాజుద్దీన్, అర్షద్ హుస్సేన్, విజయ్, డానియల్, పవన్, అజ్మత్, మార్క పద్మ, సంతోషి, సనా, ఆతిఫ్, ఉమా, నాగరాజు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులకు రూ.4016 జీవనభృతి ఇవ్వాలి

- అసెంబ్లీలో చర్చించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి సీఐటీయూ వినతి



**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** బీడీ కార్మికులకు నెలకు రూ.4016 జీవనభృతి ప్రకటించాలని, అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించాలని కోరుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి సీఐటీయూ నాయకులు శనివారం హబ్సీపూర్లో వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేకుండా బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. అనంతరం తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గొడ్డుబర్ల భాస్కర్ మాట్లాడారు. సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీడీ కార్మికుల జీవనభృతి అంశాన్ని లేవనెత్తి రూ.4016కు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరిలో అధికంగా మహిళా కార్మికులే ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం 4 లక్షల మందికి మాత్రమే జీవనభృతి అందుతోందని, మిగిలిన 3 లక్షల మందికి కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. బీడీ పరిశ్రమలో పనిదినాలు తగ్గిపోవడం, తక్కువ కూలీ, నిత్యావసర ధరలు పెరగడంతో బీడీ కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన కార్మికుల దరఖాస్తులను వెంటనే స్వీకరించి రూ.4016 జీవనభృతి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, లక్ష్మీనారాయణ, తుమ్మ రమేష్, రవి, కుమార్, భూమయ్య, లక్ష్మీ, గాయత్రి, బాల్ నర్సవ్వ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# గురువే సమాజానికి మార్గదర్శి

- ఐదు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆగం పాండు ముదిరాజ్ ఘన సన్మానం
- ఉపాధ్యాయుల సేవలకు ప్రత్యేక గౌరవం.. శాలువాలు, జ్ఞాపికలతో సత్కారం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 05, :** అక్షర జ్ఞానాన్ని అందించడమే కాకుండా విద్యార్థుల జీవితాలకు సరైన దిశానిర్దేశం చేస్తూ సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే మహోన్నత బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బాచుపల్లి పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఆగం పాండు ముదిరాజ్ ఘనంగా సన్మానించారు. బాచుపల్లిలోని రెండు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఇందిరానగర్, రాజీవ్ గాంధీనగర్, సాయినగర్ కాలనీలలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "తల్లిదండ్రులు జీవితాన్ని ఇస్తే.. ఉపాధ్యాయులు ఆ జీవితానికి లక్ష్యాన్ని చూపుతారు" అని అన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవత్వం వంటి ఉత్తమ లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సామాన్య, నిరుపేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారని ప్రశంసించారు. మంచి గురువు చేతుల్లో తీర్చిదిద్దబడిన విద్యార్థి భవిష్యత్తులో కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరుడిగా ఎదుగుతాడని అన్నారు. గురువును గౌరవించడం అంటే జ్ఞానాన్ని, సంస్కారాన్ని, సమాజ భవిష్యత్తును గౌరవించినట్లేనని ఆగం పాండు ముదిరాజ్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని, వారు సమాజ నిర్మాణంలో పోషిస్తున్న పాత్ర చిరస్మరణీయమని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఐదు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం ద్వారా ఆగం పాండు ముదిరాజ్ ఉపాధ్యాయ వృత్తిపట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు.

# నేడే అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమం

- ఓటరు జాబితాలను పరిశీలించుకొని అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించాలి
- జిల్లా అదనపు కలెక్టర్, ఉప ఎన్నికల అధికారి లత



**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 05, :** భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ–2026 (సర్ - 2026)లో భాగంగా శనివారం జగిత్యాల జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మొదటి రోజు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా ఉప ఎన్నికల అధికారి శ్రీమతి బి.ఎస్. లత తెలిపారు. మొదటి విడతలో భాగంగా రెండో రోజు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నేడు ఆదివారం జగిత్యాల జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 01 2026 అర్హత తేదీగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాలను ప్రజలు తమ సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. అర్హులైన వారు కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6, పేర్ల తొలగింపుపై అభ్యంతరాల కోసం ఫారం–7, ఓటరు జాబితాలోని వివరాల సవరణ లేదా చిరునామా మార్పు కోసం ఫారం–8 ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమం సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు తమ పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉంటారని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లతో కలిసి ముసాయిదా ఓటరు జాబితాలను పరిశీలించి, అవసరమైన సవరణలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చేపడతారని వివరించారు. జిల్లాలోని అర్హులైన పౌరులు, ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లు, చిరునామా, వయస్సు తదితర వివరాలను పరిశీలించుకోవాలని, అవసరమైతే సంబంధిత దరఖాస్తులను తమ పోలింగ్ కేంద్రాల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# ఆర్‌కే టౌన్‌షిప్‌లో మిగిలిన రెండు రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలి


- కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన 277వ డివిజన్ వాసులు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 05, :** ఆర్‌కే టౌన్‌షిప్‌లో మిగిలి ఉన్న రెండు రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ మహదేవపురం 277వ డివిజన్‌కు చెందిన ఆర్‌కే టౌన్‌షిప్ వాసులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలన్ హన్మంత్ రెడ్డిని స్థానికులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్‌లో రోడ్ల పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మిగిలిన రెండు రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దేవేందర్ నగర్ 2బీహెచ్‌కే వాసులు గణేష్ పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న వినాయక పూజా కార్యక్రమానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరుతూ కొలన్ హన్మంత్ రెడ్డిని ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మహదేవపురం 277వ డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆర్‌కే టౌన్‌షిప్, దేవేందర్ నగర్ 2బీహెచ్‌కే వాసులు తదితరులు పాల్గొన్నారు.

చురకలు





# అద్దేపల్లి జీవితం.. ఒక సాహిత్యోద్యమం

## నేడు అద్దేపల్లి రామమోహనరావు జయంతి

**తెలుగు సాహిత్య చరిత్రలో చెరగని సంతకం ఆయనది. తెలుగు సాహిత్యంతో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఆయనది. సాహిత్య పరంగా వందలాది యువకులకు స్ఫూర్తినిచ్చి, వారి రచనా పోకడలకు మెరుగులు దిద్దిన సాహితీ వేత్త ఆయన. ఎందరో యువ కవులను ప్రోత్సహించి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి, అసలు సిసలైన సాహితీ సరుకును అందించేందుకు దోహద పడిన సాహితీ కర్మాగారం ఆయన. భావజాలం ఏదైనా, భావుకత విషయమే ప్రధానమని నమ్మి, కవులలో పెద్దా, చిన్నా, సాంప్రదాయ, ఆధునిక, పద్య గద్య వచన తేడా లేకుండా అందరితో సమన్వయం, సంబంధం కలిగి, సమాదరించిన గొప్ప మనసు ఆయనది. నమ్మిన బాటలో ముక్కు సూటిగా కొనసాగిన మనస్తత్వం ఆయనది. వేలాదిగా అభిమానులు, అనుయాయులు, అనుచరులు కలిగి ఉన్న మార్గదర్శకుడు. ఆయనే తెలుగు సాహిత్యంలో చెరగని సంతకం చేసిన అద్దేపల్లి రామమోహన రావు. అద్దేపల్లి అర్ధ శతాబ్ది సాహితీ ప్రస్థానంలో సుమారు 30 పుస్తకాల్ని వెలువరించి, వందకు పైగా ముందు మాటలు వ్రాసి, వివిధ సభల్లో రెండువేలకు పైగా అధ్యక్షోపన్యాసాలు చేసి, వందలాది పుస్తకాల సమీక్షలు చేసి, వందల తెలుగు గజల్స్ ను వ్రాసి, గానం చేసిన సాహితీ కృషీవలుడు. తెలుగులో మినీ కవితా ప్రక్రియను చేపట్టిన కవుల్లో అద్దేపల్లి ఒకరు. నిజానికి అద్దేపల్లి జీవితం ఒక సాహిత్యోద్యమం.**

రామమోహనరావు 1936, సెప్టెంబరు 6న బందరు శివార్లలోని చింతగుంట పాలెంలో పుట్టువు నొందారు. అక్కడే ప్రాథమిక విద్యను అభ్యసించి, సమీపంలోని జవారుపేట హిందూ హైస్కూల్‌లో చదివారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతినుండి ఎం.ఏ.పూర్తి చేసి బందరు హిందూ కళాశాలలో కొంతకాలం ట్యూటర్‌గా, లెక్చరర్‌గా విధులు నిర్వర్తించారు. కొంతకాలం నందిగామలో ఉద్యోగం చేసి 1972లో కాకినాడ చేరుకుని అక్కడే స్థిరనివాసి అయినారు. ప్రారంభ దశలో చందోబద్ధమైన కొన్ని వందల పద్యాల్ని రచించారు. 1960 లో తొలికవిత కృష్ణాపత్రికలో ప్రచురితం అయింది. కాగా తాను విశ్వసించే హేతువాదం, అభ్యుదయ, ప్రగతిశీల భావాలకు గిరిగీసుకున్న సంప్రదాయ ఛందో బద్ధ రీతులు కాక, స్వేచ్ఛాయుత వచన కవిత్వమే సరైనదని భావించి, వచన కవితా మార్గాన్నే పయనించ సిద్ధమైనారు, అలాగే ప్రయాణం కొనసాగించారు. ఆవంత్స సోమసుందర్, శివ సాగర్, చెరబండరాజు, నగ్నముని, కె.శివారెడ్డి వంటి విప్లవ కవుల ప్రభావంతో విప్లవ సాహిత్య రంగాన్ని ఎంచుకున్నారు. మసక బారుతున్న మానవ జీవనంపై కవిత్వం వ్రాసిన తొలి తెలుగుకవి అద్దేపల్లి. ఆయన కవిత్వ సంపుటాలలో అంతర్జ్వాల (1970), రక్త సంధ్య (1978), గోదావరి నా ప్రతిబింబం (1992), పొగచూరిన ఆకాశం, సంఘం శరణం గచ్ఛామి, మెరుపు పువ్వు, గీటురాయి వంటివి పేరెన్నిక గన్నవి. అలా వచన కవిత్వానికి పెద్దపీట వేసి, మినీ కవితల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి గొప్ప ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆయన అనేక కవితలు వివిధ భాషలలోకి అనువదింప బడ్డాయి. పద్యాలు, గేయాలను శ్రావ్యంగా ఆలపించడమే కాకుండా, స్వయంగా తెలుగులో వందల గజల్ లను రచించడమే కాక, రాగయుక్తంగా ఆలపించి అనేక సభలను రంజింప చేశారు. అద్దేపల్లి నిరంతర సంచార అభిలాషియై, తెలుగు సీమలో అనేక ప్రదేశాలు చుట్టి, తన సాహితీ క్షేత్రాన్ని విస్తరింప చేశారు. విమర్శకునిగా ఆయన స్థానం ప్రత్యేకం. తమదైన శైలిలో... శ్రీశ్రీ మహా ప్రస్థానంపై రాసిన మొదటి విమర్శనా గ్రంథం పలువురి ప్రశంసా పాత్రమైంది. కుందుర్తి వచన కవితా వైభవం, స్త్రీవాద కవిత్వం..ఒక పరిశీలన, గుర్రం జాషువా కవితా సమీక్ష, తెలుగు కవిత్వంపై ఆధునికత, అభ్యుదయ విప్లవ కవిత్వాలు– సిద్ధాంతాలు, శిల్పరీతులు వంటి వివిధ విమర్శనా గ్రంధాలు అద్దేపల్లి కలం నుండి వెలువడ్డాయి. 2001లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహితీవిమర్శకు గాను ప్రతిభా పురస్కారం, ఆయన రాసిన "పొగచూరిన ఆకాశం" కవితా సంపుటికి, తమిళనాడుకు చెందిన ప్రముఖ రచయిత చిన్నప్ప భారతి ఆద్వర్యంలో సాహిత్య పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, ఉమర్ ఆలీషా అవార్డు, సరసం అవార్డు, తిలక్ అవార్డు ఆంధ్రసారస్వత సమితి జీవన సాఫల్య పురస్కారం, తంగిరాల అవార్డు, జాషువా అవార్డు పులికంటి సాహితీ పురస్కారం, బోయి భీమన్న సాహితీ పురస్కారం ఆయనను వరించిన వాటిల్లో కొన్ని. "సాహితీ సంచార యోధుడు"గా, బిరుదాంకితులైన అద్దేపల్లి తెలుగు సాహితీ క్షేత్రానికి సుసంపన్నం చేసి, తనదైన ముద్ర వేసి, 2016, జనవరి 13న తేదీ ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పరమాణు సిద్ధాంతకర్త జాన్ డాల్టన్

## నేడు జాన్ డాల్టన్ జయంతి

ద్రవ్యం, పరమాణువులు, రసాయనిక చర్యలపై అనేక పరిశోధనలు చేసి ఆధునిక పరమాణు సిద్ధాంతానికి పునాదులు వేసిన ఆంగ్ల రసాయన శాస్త్రవేత్త, వాతావరణ శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత శాస్త్రవేత్త, జాన్ డాల్టన్. రసాయన శాస్త్రం అభివృద్ధికి, పదార్థాల న్నింటికీ విద్యుత్ ధర్మం ఉందనడానికి, అణుశక్తి వినియోగానికి డాల్టన్ పరమాణు సిద్ధాంతమే బాటలు పరిచింది. ఆయన వాతావరణ శాస్త్రం, వర్ణాంధత్వం మీద కూడా పరిశోధనలు చేశాడు. అణు సిద్ధాంతానికి ఆధునికతను సమకూర్చినవాడుగా చంద్రుడి మీద ఒక క్రేటర్ కు ఈయన పేరు పెట్టారు.

ఇంగ్లండ్ లోని ఈగల్స్ ఫీల్డ్ గ్రామంలో ఓ పేద చేనేత కార్మికుడి అయిదుగురి సంతానంలో ఒకడుగా 1766 సెప్టెంబరు 6న పుట్టిన డాల్టన్ చిన్నతనంలోనే సైన్స్, గణితం, ఇంగ్లిషుల్లో పట్టు సాధించాడు. వాతావరణ శాస్త్రం (మెట్రియాలజీ)పై ఆసక్తి పెంచుకుని పరిశీలనకు కావలసిన పరికరాలను స్వయంగా రూపొందించు కున్నాడు. వాతావరణ పీడనం, ఉష్ణోగ్రత, గాలి వేగం, తేమ లాంటి విషయాలను రోజూ నమోదు చేసుకోవడాన్ని ప్రారంభించి జీవితాంతం కొనసాగించాడు. చనిపోయే చివరి రోజు వరకు ఆయన నమోదు చేసిన అంశాలు 2 లక్షల పైమాటే అంటే ఆయన నిర్విరామ కృషి అర్థం అవుతుంది. స్కూల్లో పిల్లలకు చదువు చెప్పడం, తండ్రికి సాయపడడంతో పాటు లాటిన్, గ్రీకు భాషలు నేర్చుకున్నాడు. పాఠశాల ఉపాధ్యాయుడుగా, వాతావరణ శాస్త్రవేత్తగా, రంగు అంధత్వంపై నిపుణుడుగా రూపుదిద్దుకున్నా,

ఇరవై ఏడేళ్లకల్లా కళాశాల అధ్యాపకునిగా చేరినా పరిశోధనలు మానలేదు. మాంచెస్టర్ లిటరరీ అండ్ ఫిలాసఫికల్ సొసైటీ, ఆయనకు ఉత్తేజపరిచే మేధో వాతావరణం మరియు ప్రయోగశాల సౌకర్యాలను అందించింది. ఇంగ్లండ్‌లోని కొండలు, లోయలు, పట్టణాలు తదితర ఎన్నో ప్రాంతాల్లో వాతావరణాన్ని పరిశీలించి, ఎక్కడైనా గాలి సమ్మేళనం (ఛశీఎజూశీంఱ్‌ఱశీఅ) ఒకేలా ఉందని తెల్సుకున్నాడు. అలా ఆయన చేసిన పరిశోధనల ఫలితంగా 'పాక్షిక పీడన సిద్ధాంతం' (ూష్ట్రవశీతీఎ శీట ూఋతీఱఱశ్రీూతీవంంబతీవం) చెప్పగలిగాడు. ఆపై రసాయన చర్యలపై దృష్టి సారించి పరమాణు సిద్ధాంతాన్ని అందించాడు. పరమాణువులు ఎలా సంపర్కం చెందుతాయో తెలిపేలా మూలకాలకు డాల్టన్ ఏర్పరిచిన సంకేతాలకు ఇప్పటికీ అదే ప్రాధాన్యత ఉంది. అలాగే మూలకాలు సమ్మేళనంగా ఏర్పడే అంశానికి సంబంధించి 'నిర్దుష్ట అనుపాత నియమం' (Law of Definite proportions),



బహుళ అనుపాత నియమం (Law of multiple proportions) నిర్వచించాడు. వాతావరణ పీడనాన్ని సూచించే భారమితి (Barometer), తేమని తెలిపే హైగ్రోమీటర్, మేఘాలు ఏర్పడే విధానాలు, వర్షపాతం, బాష్పీభవనం, తుషారస్థానం (Dew Point) గురించిన పరిశోధనలు డాల్టన్ చేసినవే. తన పరిశోధనలకు ఎన్నో డాక్టరేట్లు, పురస్కారాలు పొందాడు. లావోయిసియర్, అతని అనుచరులు భావించినట్లు గాలి ఒక విశాలమైన రసాయన ద్రావకం కాదని , ఒక మిశ్రమంలో ప్రతి వాయువు ద్వారా వచ్చే ఒత్తిడి స్వతంత్రంగా ఉండే ఒక యాంత్రిక వ్యవస్థ ఇతర వాయువుల ద్వారా ఒత్తిడి, మరియు మొత్తం పీడనం ప్రతి వాయువు పీడనాల మొత్తం అని వివరించాడు. ఏకపక్ష వ్యవస్థను ఉపయోగించి, సమ్మేళనాల శాతం కూర్పుల నుండి పరమాణు బరువులను లెక్కించడం కొన సాగించాడు. మిళితం చేయగల రెండు అంశాలు ఉంటే, వాటి కలయికలు ఒక నిర్దిష్ట క్రమంలో సంభవిస్తాయని పేర్కొన్నాడు. డాల్టన్ తన అణు సిద్ధాంతాన్ని 1808 లో ప్రతిపాదించాడు; సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తలు విశ్వవ్యాప్తంగా ఆమోదించడానికి మరో శతాబ్దం గడిచింది.

డాల్టన్ పరమాణు సిద్ధాంతం ప్రకారం... అన్ని పదార్థాలను విడదీయరాని మరియు నాశనం చేయలేని అణువులను విభిన్న ద్రవ్యరాశి మరియు లక్షణాలతో కలిగి ఉంటుందని సూచించింది. దీని కలయిక వాటి మూలకాల యొక్క భౌతిక స్వభావాన్ని నిర్ణయిస్తుంది. ఒక మూలకం యొక్క అన్ని పరమాణువులు ఒకేలా ఉంటాయి. వివిధ మూలకాల అణువులు పరిమాణం మరియు ద్రవ్యరాశిలో విభిన్నంగా ఉంటాయి. పరమాణువుల విభిన్న సంఖ్యా కలయికల ద్వారా సమ్మేళనాలు ఉత్పత్తి చేయబడతాయి. ఆంటోయిన్ లావోసియర్ మరియు జోసెఫ్ ప్రౌస్ట్ రచనలను అధ్యయనం చేయడం, విస్తరించడం ద్వారా డాల్టన్ బహుళ నిష్పత్తిలో నియమాన్ని అభివృద్ధి చేశారు (మొదటి సారిగా 1803 లో సమర్పించారు). వివిధ ఉష్ణోగ్రతలలో గాలి ద్వారా నీటి ఆవిరిని శోషించడం, బాష్పీభవనం, వాయువుల ఉష్ణ విస్తరణపై ఆయనచేసిన కృషి, డాల్టన్ యొక్క పాక్షిక ఒత్తిళ్ల నియమావళికి దారితీసింది. ఇది అణువు యొక్క ఆధునిక సిద్ధాంతం 1803 లో అతని ప్రతిపాదనకు తెలియ జేసింది. ప్రయోగాత్మకంగా, అనుభవ పూర్వక పద్ధతిలో ఫలితాలను పరీక్షించడం ద్వారా డాల్టన్ తన నిర్ధారణలకు చేరుకున్నందున, ఇది అణువు యొక్క మొదటి నిజమైన శాస్త్రీయ సిద్ధాంతాన్ని గుర్తించ బడింది. శాస్త్రవేత్తగా తన ప్రారంభ కెరీర్‌లో, డాల్టన్ రంగు అంధత్వాన్ని కూడా పరిశోధించాడు . ఈ విషయం అతనికి ప్రత్యక్ష అనుభవం ద్వారా సుపరిచితం. పుట్టినప్పటి నుండి ఈ పరిస్థితి అతని మరియు అతని సోదరుడిని ప్రభావితం చేసింది కాబట్టి, అది తప్పనిసరిగా వంశపారంపర్యంగా ఉండాలని డాల్టన్ సిద్ధాంతం చేశాడు. అతను తన సొంత కంటి కణజాలం యొక్క జన్యు విశ్లేషణలో ఆకుపచ్చ రంగును గ్రహించడం కోసం ఫోటోరిసెప్టర్‌ను కోల్పోతున్నట్లు వెల్లడించి నప్పుడు తన సిద్ధాంతాన్ని నిజమని నిరూపించాడు. ఎరుపు – ఆకుపచ్చ రంగు అంధత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన చేసిన కృషి ఫలితంగా, ఈ పరిస్థితిని ఇప్పటికీ "డాల్టోనిజం" అని పిలుస్తారు. డాల్టన్ నిరాడంబరమైన ఉనికిని కొనసాగించాడు. అనేక గౌరవాలను అందు కున్నాడు. డాల్టన్ 1844 లో మరణించే వరకు విస్తృత విషయాలపై తన శాస్త్రీయ పరిశోధనను కొనసాగించాడు. అతను మాంచెస్టర్ లిటరరీ అండ్ ఫిలాసఫికల్ సొసైటీలో క్రియాశీల సభ్యుడిగా,1822 నుండి, రాయల్ సొసైటీలో ఫెలోగా ఉన్నాడు. మాంచెస్టర్‌లో అతని అంత్యక్రియల ఊరేగింపులో 40,000 మందికి పైగా ప్రజలు ఊరేగారంటే ప్రజలకు ఆయనపై గల అభిమానం స్పష్టం అవుతుంది..

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు గీత కవితకు జీవశైలి ఇచ్చిన వడ్డేపల్లి

## నేడు గేయ గంధర్వుడు వడ్డేపల్లి కృష్ణ వర్ధంతి

తెలుగు భాషా సాహిత్యంలో గేయ సాహిత్యానికి విలక్షణ శైలి, హృదయాన్ని తాకే భావ వృద్ధి, సంగీతానికి తగిన పద సౌందర్యాన్ని అందించిన అరుదైన రచయిత వడ్డేపల్లి కృష్ణ (ఆగస్టు 5, 1948 – సెప్టెంబర్ 6, 2024). లలిత గీతాల నుంచి భక్తి గీతాల వరకు, జానపద గేయాల నుంచి చలనచిత్ర పాటల దాకా అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసిన వారు. ఆయన రచనలు వినిపించడమే కాదు, హృదయాన్ని పరవశింప జేసే శక్తిని కలిగి ఉన్నాయి.

1948 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఒక చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ గారికి చిన్ననాటి నుంచి సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, లింగయ్యల అనుసంధానంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే కవిత్వానికి ఆకర్షితులయ్యారు. సినారె ప్రభావం స్పష్టంగా కనిపించే ఆయన పదబంధాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం కాలక్రమేణా గేయసాహిత్యానికి సజీవ ముద్రగా మారాయి.

1968లో "స్రవంతి", "కృష్ణా పత్రిక"లలో పద్యాలు, గేయాలు ప్రచురితమవడం ద్వారా ఆయన రచనా జీవితం మొదలైంది. 'కవికల్యాణం', 'గడ్డిపువ్వు', 'గాంధీ', 'మూడుపూలు ఆరుకాయలు', 'సంక్రాంతి లక్ష్మి', 'స్వదేశీయం', 'వివేకానంద విజయం', 'ఆమ్రపాలి', 'బతుకమ్మ', 'జయజయహే తెలంగాణ', 'రమణీయ రామప్ప' వంటి అనేక సంగీత నృత్యరూపకాలు వ్రాసిన ఆయన, జాతీయ, ప్రాంతీయ నేపథ్యాలను భావప్రధానంగా మలచగల గుణాన్ని కలిగి ఉన్నారు.

ఆకాశవాణి ద్వారా ప్రసారమైన ఆయన లలిత గీతాలు సామాన్య శ్రోతల నుండి సాహిత్య ప్రియుల దాకా విశేష ఆదరణ పొందాయి. "ఎందుకో ఈ కళ్లలో", "వచ్చే సాయంకాలం మౌనమే పలుకేలా", "తల్లి నీ చూపే దేవుడయ్యేను" వంటి పాటలు శ్రోతల మధుర జ్ఞాపకాల్లో నిలిచి పోయాయి. 'చిత్రాలకు గీతాలు రచించిన ఆయన, చలన చిత్ర గేయ సాహిత్యంలో సాహిత్య విలువను నిలబెట్ట గలిగిన అరుదైన రచయితగా గుర్తింపు పొందారు. ఆయన టెలివిజన్ సీరియల్స్ కూడా రూపొందించారు, వాటిలో "భక్త కవి పోతన", "భారతీయ సంస్కృతీ శిఖరాలు" ముఖ్యమైనవి. "గోభాగ్యం" లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా అందుకున్నారు.

అవగాహనతో కూడిన పద వినియోగం, శ్రావ్యమైన పద బలంతో కూడిన రచనలు ఆయన శైలికి ప్రధానంగా నిలిచాయి. ఆయన భక్తి గీతాలు ఆలయాల్లో, భజనల్లో ప్రతిరోజూ వినిపించేవే. ఆయన రచనలు కేవలం వినోదం గానీ, ఆధ్యాత్మిక అనుభూతికే పరిమితం కాకుండా, భావ వ్యక్తీకరణకు, తాత్వికతకు ఆవిష్కారంగా నిలిచాయి.



సంగీతం, పద సౌందర్యం రెండింటికీ సమాన ప్రాముఖ్యత ఇస్తూ రచించగల శక్తి ఆయనకు ప్రత్యేకత నిచ్చింది.

సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనకు 'నంది అవార్డు', 'తెలుగు యూనివర్శిటీ గౌరవ సత్కారం', సినారె అవార్డు, మల్లాది' స్మారక పురస్కారం, దాశరథి మెమోరియల్ అవార్డు, ఆత్రేయ అవార్డు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం, రవీంద్రభారతి' లో గవర్నర్ సమక్షంలో అక్కినేని నాగేశ్వరరావుచే కవి సత్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయి. ఆయనకు "గేయ కిరీటి", "లలితశ్రీ", "కవన ప్రజ్ఞ" వంటి బిరుదులు లభించాయి. నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రెన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యునిగా, "పాడుతా తీయగా" లాంటి కార్యక్రమాల జడ్జిగా కూడా ఆయన సేవలు అందించారు.

వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన ఆయన, "కరీంనగర్ క్షేత్రాలు" అనే ఆడియో సీడీ ద్వారా భక్తి పరంగా ప్రాంతీయ క్షేత్రాలకు విశిష్టతను చాటారు. "వెలుగచ్చింది" అనే నాటకంలో తెలంగాణ భాష, యాస పట్ల ఆయనకు ఉన్న మక్కువను చాటి చెప్పారు. తెలంగాణ భూమికి సంగీతార్పణంగా "జయజయహే తెలంగాణ" అనే నృత్యరూపకం ద్వారా తన చారిత్రక భావనను ప్రతిబింబించారు.

ఆఖరి దశలో అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 6న మరణించారు. ఆయన మరణం తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, గీతాలు, పదాల సుగంధం పుస్తకాలుగా, ఆల్బములుగా, జ్ఞాపకాలుగా జీవించి ఉంటాయి.

వడ్డేపల్లి కృష్ణ ఒక గేయ రచయితగా మాత్రమే కాక, భావ వేధనకు నిలయమైన కవిగా, సమాజ స్పందనలకు ప్రతిరూపమైన సృజన కర్తగా, సంగీతానికి సాహిత్య గంభీరతను నూరిన ప్రకాశమయమైన ప్రతిభావంతుడిగా నిలిచి పోతారు. ఆయన రచనలన్నీ భావితరాలకు శ్రావ్యమైన ఆదర్శంగా నిలవడం ఖాయం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పాకిస్థాన్ టీమ్‌లో 'ఆపరేషన్ క్లీన్-అప్'!

**లండన్, సెప్టెంబర్ 5 (చురకలు):** ఇంగ్లాండ్ దెబ్బకు పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ భూకంపం సంభవించింది! లార్డ్స్ మైదానంలో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల తేడాతో దారుణ పరాజయం చవిచూడటంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆగ్రహంతో ఊగిపోతోంది. ఈ అవమానకర ఓటమితో సీరియస్ అయిన బోర్డు, సిరీస్ మధ్యలోనే ఏకంగా ఏడుగురు సీనియర్ ప్లేయర్లపై నిర్దాక్షిణ్యంగా వేటు వేసింది. జట్టు నుంచి తొలగించిన వారిలో మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్-ఉల్-హక్, సల్మాన్ అలీ ఆఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జాఫర్, ఖుర్రమ్ షెహజాద్ ఉన్నారు. ఫ్లాప్ ఫార్మ్‌లో ఉన్న సీనియర్లను పక్కనబెట్టి సైమ్ అయూబ్, అబ్దుల్లా షఫీక్‌లతో పాటు అర్సాత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లా వంటి ఐదుగురు యంగ్ ప్లేయర్లకు తొలిసారి అవకాశం ఇచ్చారు. ఆటగాళ్లతో పాటు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను కూడా పదవుల నుంచి ఊడబీకి సరికొత్త డ్రామాకు తెరతీశారు. మైక్ హెస్సన్, యాసిర్ అరఫాత్‌లకు ఈ పర్యటన ముగిసేవరకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే 0-2తో సిరీస్ కోల్పోయిన పాక్, సెప్టెంబర్ 9 నుంచి జరగబోయే మూడో టెస్టులోనైనా పరువు కాపాడుకుంటుందో లేదో చూడాలి.






# క్రికెట్ పిచ్‌పై భారత్-జపాన్ దోస్తానా!

**టోక్యో, సెప్టెంబర్ 5 (చురకలు):** భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకల సందర్భంగా ఇరుదేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఈ చారిత్రాత్మక పోరు కోసం 'సుజుకి కప్' నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్, బిసిసిఐ సంయుక్తంగా అధికారికంగా ప్రకటించాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ మ్యాచ్ జరగనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకాఇచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్స్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. అదే సమయంలో జపాన్ వేదికగా జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నారు. ఈ సందర్భంగా బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ.. ఈ అరుదైన మ్యాచ్‌లో భాగస్వామి కావడం బిసిసిఐకి ఎంతో సంతోషాన్ని ఇస్తోందని, తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈఓ నవోకి అలెక్స్ మియాజీ మాట్లాడుతూ.. ప్రపంచ ఛాంపియన్ జట్టును తమ దేశంలో ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు. ఈ మ్యాచ్ ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్‌లో క్రికెట్ క్రేజ్ పెంచడంతో పాటు, జపాన్‌లో క్రికెట్ మౌలిక వసతుల అభివృద్ధికి బిసిసిఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.




# సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా!

**చెన్నై, సెప్టెంబర్ 5 (చురకలు):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ రాబోయే సీజన్ కోసం సంచలనాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని సీజన్లుగా జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో, మేనేజ్‌మెంట్ జట్టు నాయకత్వంలో మార్పులు చేసేందుకు తీవ్రంగా యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానాన్ని వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు అప్పగించాలని అనేకమంది క్రికెట్ విశ్లేషకులు మరియు మాజీ ఆటగాళ్లు సూచిస్తున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా వరుసగా మూడేళ్లపాటు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఇది ఫ్రాంచైజీ యాజమాన్యంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత 2026 ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన కూడా జట్టుకు ఏమాత్రం కలిసి రాలేదు. ఆయన కేవలం 28 సగటుతో 337 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా విఫలమయ్యారు. కెప్టెన్సీ ఒత్తిడి కారణంగానే ఆయన బ్యాటింగ్ తీవ్రంగా ప్రభావితమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, మినీ వేలం లేదా ట్రేడింగ్ ద్వారా జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్‌కు నాయకత్వ పగ్గాలు అప్పగిస్తే జట్టు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంజూ శాంసన్‌కు ఐపీఎల్‌లో సారథిగా మంచి అనుభవం ఉందనేది స్పష్టమవుతోంది. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆయన ఏకంగా 66 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అందులో 50 శాతానికి పైగా గెలుపు శాతాన్ని నమోదు చేయడమే కాకుండా, తన సమర్థవంతమైన నాయకత్వంతో రాజస్థాన్ జట్టును ఫైనల్‌కు కూడా తీసుకెళ్లారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, యంగ్ ప్లేయర్లను సరిగ్గా ప్రోత్సహించడం సంజూ శాంసన్ ప్రత్యేకత. తమిళనాడుకు చెందిన మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ సైతం ఈ అంశంపై స్పందిస్తూ.. రుతురాజ్ గైక్వాడ్‌పై నుంచి కెప్టెన్సీ భారాన్ని తొలగిస్తే, ఆయన ఓపెనర్‌గా ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలరని వ్యాఖ్యానించారు. చెన్నై జట్టుకు రుతురాజ్ అత్యంత కీలకమైన బ్యాటర్ అని, కెప్టెన్సీ భారం వల్ల ఆయన నాణ్యమైన ఆటను కోల్పోకూడదని బద్రీనాథ్ పేర్కొన్నారు. ఇవే కాకుండా, సీఎస్కే తుది జట్టులో మరికొన్ని కీలక మార్పులు కూడా త్వరితగతిన చేపట్టాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. రాబోయే సీజన్ నాటికి జట్టులో మిడిల్ ఆర్డర్ బలాన్ని పెంచడంతో పాటు, డెత్ ఓవర్లలో నిలకడగా బౌలింగ్ చేసే పేసర్లను ఎంపిక చేసుకోవడంపై ఫ్రాంచైజీ దృష్టి సారించింది. సంజూ శాంసన్‌కు కెప్టెన్సీ ఇస్తే, అది సీఎస్కే భవిష్యత్తుకు సరికొత్త దిశను నిర్దేశిస్తుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.



# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం!

**చెన్నై, సెప్టెంబర్ 5 (చురకలు):** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరు కోసం తాము అన్ని విధాలా సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడించాడు. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే ఈ కీలక ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన తిలక్ వర్మ.. తమ జట్టు తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. అయితే దేవదత్ పడిక్కల్, మహమ్మద్ సిరాజ్‌లు బరిలోకి దిగుతున్నట్లు తెలిపాడు. "షమీ వేసే లైన్ అండ్ లెంగ్త్ బౌలింగ్‌ను తీవ్రంగా గమనించాం, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని మా సత్తా చాటుతాం" అని తిలక్ అన్నాడు. కాగా, ఏకంగా 54 సంవత్సరాల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ ముఖాముఖి తలపడుతున్నాయి. చివరిసారిగా 1970-71 సీజన్‌లో బ్రాబోర్న్ స్టేడియంలో తలపడగా, ఆ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొత్తం మీద సౌత్ జోన్ ఫైనల్ చేరడం ఇది 24వ సారి కాగా, ఇప్పటివరకు 13 టైటిళ్లు గెలుచుకుంది. మరోవైపు 13 ఏళ్ల విరామం తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్, ఇప్పటివరకు 8 సార్లు ఫైనల్స్ ఆడి 2 సార్లు మాత్రమే విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నారు. అతని పదవీకాలం అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియాతో సమావేశం జరగనుంది. అలాగే రాబోయే ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లుగా మయాంక్ యాదవ్, కార్తీక్ త్యాగి, మొహ్సిన్ ఖాన్‌లకు అవకాశం లభించనుంది.



# యంగ్ పేసర్ ప్రిన్స్‌పై బిసిసిఐ ఫోకస్!

- జస్ప్రీత్ బుమ్రా కంబ్యాక్‌పై కొనసాగుతున్న సస్పెన్స్!
- బుమ్రా బ్యాకప్‌గా యంగ్ పేసర్ ప్రిన్స్!
- గాయాలతో సతమతమవుతున్న టీమిండియా కీలక ప్లేయర్లు!
- ఆటగాళ్లకు త్వరలో మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు!
- ప్రపంచకప్ ముంగిట భయపెడుతున్న వరుస గాయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (చురకలు):** భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మైదానంలోకి తిరిగి రావడంపై నెలకొన్న ఉత్కంఠకు ఇంకా తెరపడలేదు. గత కొంతకాలంగా మోకాలినొప్పితో బాధపడుతున్న బుమ్రా, ప్రస్తుతం ఫిట్‌నెస్ సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే, బిసిసిఐ (దీజజ×) మెడికల్ టీమ్ నుంచి ఆయనకు ఇప్పటివరకు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించలేదు. రాబోయే అఫ్గానిస్థాన్ టి20 సిరీస్ అలాగే 2026 ఆసియా క్రీడల భారత స్క్వాడ్‌లో బుమ్రా పేరును చేర్చినప్పటికీ, ఆయన తుది జట్టులో ఆడటం అనేది కేవలం ఆయన ఆరోగ్య పరిస్థితి మరియు ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుందని బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. జూలై 16న ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్ తర్వాత బుమ్రా మళ్లీ పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయలేదు. ఆయన కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో, బిసిసిఐ సెలెక్టర్లు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే యంగ్ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌ను బుమ్రాకు బ్యాకప్ పేసర్‌గా పరిశీలిస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా రాణిస్తున్న ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇస్తే, అంతర్జాతీయ స్థాయిలో ఆయన సేవలు ఉపయోగపడతాయని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు, కేవలం బుమ్రా మాత్రమే కాకుండా భారత జట్టులోని మరికొందరు కీలక ఆటగాళ్లు కూడా గాయాల బారిన పడటం జట్టు యంత్రాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, మరియు సాయి సుదర్శన్ ప్రస్తుతం గాయాల నుంచి కోలుకుంటున్నారు. వీరి ఫిట్‌నెస్‌ను కచ్చితంగా అంచనా వేసేందుకు నేషనల్ క్రికెట్ అకాడమీ (చీజూ) ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులను నిర్వహించనున్నారు. ఈ కఠినమైన పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న ఆటగాళ్లు మాత్రమే సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరుకునే భారత జట్టుతో కలిసి ప్రయాణిస్తారు. ఈ పరిణామాలపై భారత మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుమ్రా వంటి కీలక బౌలర్ తరచూ గాయాలపాలవడం జట్టు సమతుల్యతను దెబ్బతీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఉన్న నేపథ్యంలో, ప్రధాన బౌలర్లు నిలకడైన ఫిట్‌నెస్‌తో ఉండటం చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమైన టోర్నీలకు ముందు కీలక ఆటగాళ్లు దూరం కావడం అభిమానులతో పాటు జట్టు యాజమాన్యానికి పెద్ద సవాలుగా మారింది.







# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహరాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది.ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్




'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.

# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.





# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్- తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చొని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com